www.vishalabharati.com
epaper:vishalabharati.com

గురువారం, హైదరాబాద్
21.12.2023
సంపుటి:2 సంచిక:61

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక



## తెలంగాణ వస్త్రాలకు ప్రపంచ ఖ్యాతి

- చేనేత కళ ఎంతో విభిన్నమైనది
- పోచంపల్లి చీరల డిజైనింగ్‌సూపర్
- సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించాలి
- భూదాన్‌పోచంపల్లిలో ద్రౌపది ముర్ము పర్యటన

**రామన్నపేట, విశాల భారతి:**
చేనేత రంగంలో జరుగుతున్న కృషి గొప్పది, చేనేత కళను వారసత్వంగా మరొకరికి అందించడం అభినందనీయమని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. శీతాకాలం విడిదిలో హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి బుధవారం భూదాన్ పోచంపల్లిని సందర్శించారు. రాష్ట్రపతికి హెలిపాడ్ వద్ద రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య , కేంద్ర జౌళి శాఖ కార్యదర్శి రచన షా, రాష్ట్ర చేనేత శాఖ కార్యదర్శి అలుగు వర్షిణ, కలెక్టర్ హనుమంతు కే. జండగే ఘన స్వాగతం పలికారు.
తొలుత రాష్ట్రపతి పోచంపల్లి లోని రంజన్ సిల్క్ ఇండస్ట్రీ ప్రొడక్షన్ కంట్రోల్ యూనిట్స్ సందర్శించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం తెలంగాణ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన పెవిలియన్ థీమ్ సందర్శించి నూలు నుండి వస్త్ర ఉత్పత్తి పరిణామక్రమాన్ని తెలియజేసే చేనేత స్టాళ్లను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఆచార్య వినోబా భావే చిత్రపటానికి రాష్ట్రపతి పూలమాల వేసి అక్కడ ఏర్పాటు చేసిన వినోబా భావే ఫోటో ఎగ్జిబిషను

..మిగతా 2 లో



## నేడు బిజెపి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

- ఉపరాష్ట్రపతిని అవమానించడమే కారణం
- ఢిల్లీలో 22,23 బీజేపీ జాతీయ పదాధికారుల సమావేశం

**విశాలభారతి,నేషనల్ బ్యూరో :** రాజ్యసభ చైర్మన్, భారత ఉప రాష్ట్రపతిని అవమానించిన తీరుపై బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చింది. మండల, జిల్లా కేంద్రాల వారీగా నిరసన తెలపాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి నాయకులకు బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు, ఆ పార్టీ మిత్రపక్షాలకు ప్రజాస్వామ్యంపై, పార్లమెంటులో జరిగే చర్చలపై విశ్వాసం లేదని మండిపడ్డారు. రాహుల్ గాంధీ, ఆయన వెంట ఉన్న బృందం.. అరాచక శక్తులను, సంఘ విద్రోహ శక్తులను, బయటికి కనిపించని అర్బన్ నక్సలైట్లను ప్రోత్సహిస్తూ విధ్వంసాలు సృష్టించాలనే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. పార్లమెంట్ పై దాడి కూడా అందులో భాగమేమని తనకు అనుమానం కలుగుతోందని

..మిగతా 2 లో

ప్రస్తుత తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్‌ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా శ్వేత పత్రం విడుదల చేసింది. 42 పేజీల్లో రాష్ట్రం అప్పులతో పాటు పలు కీలక విషయాలు వెల్లడించింది. రాష్ట్రం మొత్తం అప్పులు రూ. 6,71,757 కోట్లు అని పేర్కొంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటికి రాష్ట్రం వాటాకు పడిన అప్పులు రూ. 72, 658 కోట్లు అని తెలిపింది. పదేండ్ల బీఆర్ఎస్‌పాలనలో సగటున 24.5 శాతం అప్పులు పెరిగినట్లు చెప్పింది. – విశాల భారతి, స్టేట్‌బ్యూరో



# తెలంగాణ అప్పులు.. రూ. 6.71 లక్షల కోట్లు

## 42 పేజీల శ్వేతపత్రం విడుదల చేసిన ప్రభుత్వం

- పదేండ్ల బీఆర్ఎస్‌పాలనలో రాష్ట్రం దివాళా
- మిగులు బడ్జెట్ పోయి.. లోటు బడ్జెట్
- ఆర్థిక తప్పిదాలతో అప్పుల సంక్షోభం
- ప్రభుత్వ ఖజానాకు గుదిబండగా వడ్డీలు
- ఆర్థిక సవాళ్లను బాధ్యతతో అధిగమిస్తాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- వైట్‌పేపర్ తప్పుల తడకన్న హరీశ్‌రావు
- బీఆర్ఎస్ ను బద్నాం చేస్తున్రని వ్యాఖ్య



**విశాలభారతి, స్టేట్ బ్యూరో :**
తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా కొనసాగుతున్నాయి. శ్వేతపత్రాలపై అసెంబ్లీలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల తూటాలు పేలాయి. సభ సమావేశాలు ప్రారంభం కాగానే.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సభలో స్వల్పకాలిక చర్చ ప్రారంభమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్ర ఆర్థిక స్థితిపై శ్వేత పత్రాన్ని విడుదల చేసి ప్రసంగించారు. 42 పేజీల శ్వేత పత్రాన్ని సభ్యులకు అందించారు. 'ప్రజలంతా అభివృద్ధి చెందాలని తెలంగాణ సాధించుకున్నాం.. గత ప్రభుత్వం

..మిగతా 2 లో

## ఇవి మేం సృష్టించిన ఆస్తులు

- శ్వేతపత్రంపై బీఆర్ఎస్ మండిపాటు
- తమ హయాంలో సృష్టించిన ఆస్తుల వివరాలు విడుదల
- అభివృద్ధిపై లెక్కలతో కూడా రిపోర్ట్ రిలీజ్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంపై బీఆర్ఎస్ మండిపడింది. శ్వేతపత్రం పూర్తిగా తప్పుల తడకగా ఉందన్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు. గత ప్రభుత్వాలను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం కాంగ్రెస్‌లో కనబడుతోందని ఆరోపించారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ప్రజలు ఎంతో ఆశిస్తున్నారని చెప్పారు. ఈ నివేదికను తెలంగాణ అధికారులు తయారు చేయలేదన్నారు. తెలంగాణ అధికారులపై నమ్మకం లేక.. ఆంధ్రా అధికారులతో ఈ రిపోర్టు తయారు చేయించారని ఆరోపించారు. ఆదాయం,

..మిగతా 2 లో





## తబ్లీగి జమాత్ కు ప్రోత్సాహం ప్రమాదం

- ఇస్లాం పుట్టిన సౌదీఅరేబియా ఈ సంస్థను నిషేధించింది
- టెర్రరిజాన్ని వ్యాప్తి చేస్తుండటమే కారణం
- అలాంటి సంస్థకు ఎలా నిధులు కేటాయించారు
- రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలి
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రచనా రెడ్డి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో :**
తబ్లీగి జమాత్ సంస్థను కాంగ్రెస్ ప్రోత్సహిస్తోందని, ఆ సంస్థను ప్రోత్సహించడమంటే ఉగ్రవాదానికి గేట్లు తెరిచినట్లే అవుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రచనా రెడ్డి వ్యాఖ్యానించారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చీ రాగానే.. ఆ పార్టీ అసలైన రంగు బయట పడుతోందని ఆమె పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలంలో జరిగిన ఒక సమావేశంలో తబ్లీగి జమాత్ అనే సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లు నిధులు మంజూరు చేసిందని ఆమె ఆరోపించారు. ఈనెల 13వ తేదీన మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ ఇచ్చిన జీవో 123 దేశానికి ప్రమాదకరమని ఆమె పేర్కొన్నారు. ఇస్లాం మత వ్యాప్తి, ఉగ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేసే సంస్థకు ప్రభుత్వం డబ్బులివ్వడమేంటని ఆమె ప్రశ్నించారు. బీజేపీ మైనారిటీలకు వ్యతిరేకం కాదని, అరాచక శక్తులను ప్రోత్సహిస్తే మాత్రం చూస్తూ ఊరుకోబోమని తెలిపారు. 2020 కరోనా విపత్తు సమయంలో ఢిల్లీలో తబ్లీగి జమాత్ సంస్థ వైరస్ వ్యాప్తికి కారణమైందనేది తెలిసిందేనని ఆమె గుర్తుచేశారు. ఇస్లాం పుట్టిన

..మిగతా 2 లో

## పల్లవి ప్రశాంత్ అరెస్ట్


### ఎట్టకేలకు పోలీసుల అదుపులోకి..

- అజ్ఞాతంలోకి వెళ్లినట్టు జోరుగా ప్రచారం
- అన్నపూర్ణ స్టూడియో వద్ద జరిగిన గొడవపై పోలీసులు సీరియస్
- వివిధ సెక్షన్ల కింద కేసులు



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
బిగ్ బాస్ 7 విజేత, ప్రముఖ యూట్యూబర్ పల్లవి ప్రశాంత్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రముఖ రియాలిటీ షో బిగ్ బాస్ తెలుగు సీజన్ 7 గ్రాండ్ ఫినాలే సందర్భంగా ఈనెల 17వ తేదీన హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్ వద్ద జరిగిన ఘర్షణలు జరిగిన సంగతి తెలిసిందే. బిగ్ బాస్ విజేత పల్లవి ప్రశాంత్‌కు స్వాగతం పలికేందుకు భారీ ఎత్తున అన్నపూర్ణ స్టూడియోస్ వద్దకు చేరుకున్న ఆయన అభిమానులు రోడ్డుపై న్యూసెన్స్ క్రియేట్ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేశారు. ఆరు ఆర్టీసీ బస్సుల అద్దాలు పగలగొట్టారు. ఆర్టీసీ బస్సులను ధ్వంసం చేయడంపై ఆర్టీసీ అధికారులు జూబ్లీ హిల్స్ పోలీసులకు

..మిగతా 3 లో



## మళ్లీ కోరలు చాస్తున్న కరోనా

- హైదరాబాద్‌లో నమోదైన6 కేసులు నమోదు
- తెలంగాణ వైద్యారోగ్య శాఖ కీలక ఆదేశాలు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**
దేశ వ్యాప్తంగా కోవిడ్ కేసులు కలవరపెడుతున్నాయి. కరోనా సబ్ వేరియంట్ జేఎన్-1 ప్రపంచాన్ని వణికిస్తోంది. కేరళలో తిష్ట వేసిన వేరియంట్ క్రమంగా అన్ని రాష్ట్రాల్లో వ్యాపిస్తోంది. తెలంగాణలోనూ కరోనా మహమ్మారి మళ్లీ ప్రవేశించింది. గడిచిన 24 గంటల్లో తెలంగాణలో 6 కరోనా కేసులు నమోదయ్యాయి. 538 మందికి పరీక్షలు చేయగా ఆరుగురికి కరోనా వచ్చినట్లు వైద్యారోగ్య శాఖ తెలిపింది. ఇంకా 42 మంది రిపోర్ట్స్ పెండింగ్ లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కరోనా కేసులు హైదరాబాద్ లోనే వెలుగుచూశాయని ఆరోగ్య శాఖ వెల్లడించింది. బుధవారం ఒకరు వైరస్ నుంచి కోలుకున్నారని తెలిపింది. నిన్న నలుగురికి పాజిటివ్ సోకింది. ప్రస్తుతం

..మిగతా 2 లో

## సైకో జగన్ పాలనలో తొలిసారి దండయాత్రలు చూశా

- కురుక్షేత్ర యుద్ధంలో వైసీపీ ఓటమి ఖాయం
- అగ్రవర్ణాల పేదలను ఆర్థికంగా ఆదుకుంటాం
- బీసీల కోసం రక్షణ చట్టం తీసుకువస్తాం
- వైసీపీ నేతల కబ్జాలో ఉత్తరాంధ్ర నలిగిపోతోంది
- టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు





**విశాల భారతి, విజయనగరం:**
దేశంలో ఎక్కడా పాదయాత్రపై దండయాత్ర చేసిన సందర్భాలు లేవని, తొలిసారి సైకో జగన్ పాలనలో దండయాత్రలు చూశానంటూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. జయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం పోలిపల్లి వద్ద జరిగిన 'యువగళం నవశకం' సభలో ఆయన మాట్లాడారు. ''దేశంలో ఎక్కడా పాదయాత్రపై దండయాత్ర చేసిన సందర్భాలు లేవు. తొలిసారి సైకో జగన్ పాలనలో దండయాత్రలు చూశా. పోలీసులను అడ్డంపెట్టుకుని ఇబ్బందులు పెట్టారు. వడ్డీతో సహా చెల్లించే బాధ్యత తీసుకుంటాం. యువగళం జనగళంగా మారి ప్రజాగర్జనకు నాంది పలికింది. ఏపీకి వచ్చిన పరిశ్రమలను తరిమికొట్టారు. యువతకు ఉపాధి అవకాశాలు దొరకని పరిస్థితి ఉంది. యువతకు టీడీపీ జనసేన అండగా ఉంటాయి. యువత భవిష్యత్తుకు భరోసా కల్పించే బాధ్యత తీసుకుంటాం. మాకు రాజకీయ వ్యతిరేకత తప్ప వ్యక్తిగత వ్యతిరేకత ఉండదు. వైసీపీ నేతల కబ్జాలో ఉత్తరాంధ్ర పూర్తిగా నలిగిపోతోంది. వైసీపీ పాలనలో కంపెనీలన్నీ పారిపోయే పరిస్థితి. ఉత్తరాంధ్రలో అభివృద్ధి ఆగింది.. కబ్జాలు

..మిగతా 2 లో



## 'నువ్వెంత మొత్తుకున్నా కేసీఆర్ తర్వాత కేటీఆరే

- 'నిన్ను కేసీఆర్, కేటీఆర్‌వాడుకుని వదిలేస్తరు'..
- హరీశ్‌రావు, రాజగోపాల్‌రెడ్డి మధ్య మాటల యుద్ధం
- అసెంబ్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌సభ్యుల ఆందోళన

..మిగతా 3 లో



# తెలంగాణ వస్త్రాలకు ప్రపంచ ఖ్యాతి

**మొదటిపేజీ తరువాయి**

తిలకించారు. మహిళలు చరఖాలతో నూలు వడకడాన్ని రాష్ట్రపతి పరిశీలించారు. అనంతరం సభా వేదికలో పాల్గొన్నారు. చేనేత రంగంలో కృషి చేస్తున్న అవార్డు గ్రహీతలు భోగ సరస్వతి, లోక శ్యామ్ కుమార్, కూరపాటి వెంకటేశం చేనేత రంగం పట్ల తమ అనుభవాలను పంచుకున్నారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. భూదాన్‌పోచంపల్లి లో చేనేతలను కలవడం, మీ మధ్యలోకి ఇలా రావడం చాలా సంతోషంగా ఉందని, చేనేత రంగం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రోత్సాహకారంగా ఉందన్నారు. 35 లక్షల మంది ప్రతిరోజూ తమ జీవనోపాధిని పొందుతున్నారని అన్నారు. తెలంగాణలో నేసిన వస్త్రాలు ప్రపంచంలోనే ప్రఖ్యాతి గాంచాయని, పోచంపల్లి, వరంగల్, గద్వాల, నారాయణపేట, సిద్దిపేట వస్త్రాలకు ఒక ప్రత్యేకత ఉన్నదని, వీటికి జి. ఐ. టాగ్ రావడం జరిగిందని అన్నారు. చేనేత రంగాన్ని భవిష్యత్ తరాలకు తీసుకు వెళుతున్న మీరు నేసే చీరలను చూసి ఆనందం కలిగిందని, ఇది భారతీయ సంస్కృతిలో ఒక భాగమని అన్నారు. యూఎన్‌డబ్ల్యూటీవో ప్రపంచ పర్యాటక రంగంలో 2021 సంవత్సరంలో పోచంపల్లి ప్రాంతాన్ని పర్యాటక గ్రామంగా ప్రకటించడం పట్ల మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నానని, సంస్కృతి పరంపర పరిరక్షణను, సాంప్రదాయాలను ముందుకు తీసుకెళుతున్నారని, శాస్త్ర సాంకేతిక రంగంలో మీ కృషి ప్రశంసనీయమని, గురు శిష్య పరంపరను కొనసాగిస్తున్నారని, చేనేత రంగంలో కొత్త ఒరవడికి కృషి చేస్తున్న మీ అందరికీ అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. చేనేత రంగంలో ప్రభుత్వం చేస్తున్న కృషికి అండగా ఉండాలని అన్నారు. చేనేత రంగంలోని సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. నా ప్రాంతం నుండి కొంత మందిని ఇక్కడికి తీసుకువచ్చి చేనేత రంగం పని తీరును పరిశీలించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే అని సౌకర్యాలు వాడుకొని మీరు ఇంకా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఫ్యాషన్ డిజైన్ రంగంలో పోచంపల్లి చేనేత కార్మికులు చేస్తున్న కృషి అభినందనీయని, చేనేత కళను భావితరాలకు అందించడం కోసం మీరు చేస్తున్న ప్రయత్నం హర్షణీయని, పోచంపల్లి చేనేత కార్మికులు ఇచ్చిన సలహాలను పరిగణనలోకి తీసుకుంటాను. పోచంపల్లి అభివృద్ధికి నా వంతు కృషి చేస్తాను అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.

# ఇవి మేం సృష్టించిన ఆస్తులు

**మొదటిపేజీ తరువాయి**

ఖర్చు లెక్కలపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఇక మరోవైపు బీఆర్ఎస్ గత పదేళ్ల పాలనలో సృష్టించిన ఆస్తులపై ఓ రిపోర్టు రిలీజ్ చేసింది. పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని లెక్కలతో సహా అందులో పొందుపరిచింది. బీఆర్ఎస్ రూపొందించిన నివేదికలోని కీలకాంశాలు ఇవే

- 33 జిల్లాలకు 1649.62 కోట్ల కలెక్టరేట్ల భవనాల నిర్మాణాలు.
- ఇప్పటికే 25 కలక్టర్ భవనాలు ప్రారంభం
- 2014 తర్వత 128 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్ ల ఏర్పాటు
- రాష్ట్రంలో ప్రస్తుతం 32 వేల 717 కిలోమీటర్ల రోడ్లు
- 8578 కిలో మీటర్ల మేర కొత్త రోడ్లు నిర్మాణం
- కొత్తగా 4713 చెత్త తరలించే వాహనాలు
- 1022 కొత్త గురుకులాలు, 849 ఇంటర్ గురుకులాలు, 85 డిగ్రీ గురుకులాలు
- 7289.54 కోట్లతో మన ఊరు బడి తో 1240 బడుల నిర్మాణం, 1521 స్కూళ్ళలో సౌర విద్యుత్,
- 23,37 654 మంది విద్యార్థులకు లబ్ధి
- కేజి టూ పీజీ గంబిరావు పేట లో తొలి క్యాంపస్
- 70 గదుల నిర్మాణం
- 250 మందికి సరిపడేలా అంగన్వాడీ కేంద్రం
- 1000 మంది కూర్చునేల డైనింగ్ హాల్
- 22.5లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు
- 334 చిన్న పరిశ్రమల పునరుద్ధరణ
- 10,400 ఎకరాల్లో అతిపెద్ద ఫార్మ క్లస్టర్
- 81.81 చ.కి.మి పెరిగిన పచ్చదనం, హరిత హారం
- HMDA పరిధిలో 129 ప్రదేశాల్లో 188 ఫారెస్ట్ బ్లకులు
- 19472 పల్లె ప్రకృతి వనాలు, 13657ఎకరాల విస్తీర్ణం
- 109 అర్బన్ ఫారెస్ట్ 75 740 ఎకరాల విస్తీర్ణం
- 1,00,691 కిమి రహదారి వనాలు

10,886 కిమీ కందకాల తవ్వకం

- 19వేల పల్లెల్లో పార్కులు
- 2700 ట్రీ పార్కులు
- 1200 కోట్ల తో యాదాద్రి పునర్నిర్మాణం
- 2800 కోట్ల ఆలయాల అభివృద్ధి
- 100 కోట్లతో దేవాదాయ శాఖ కు నిధులు
- 75 కోట్లు దూప దీప నైవేద్యం కింద అర్చకుల వేతనం
- 212 కోట్ల తో బ్రహ్మణ సంక్షేమం కోసం

**ఆరోగ్య శాఖ లో**

- 34000 హాస్పిటల్ బెడ్స్
- 34000 ఆక్సిజన్ బెడ్స్,
- 80 ఐ సీ యు కేంద్రాలు
- 56బ్లడ్ బ్యాంక్ లు
- 82 డయాలసిస్ కేంద్రాలు
- 500 బస్తీ దవాఖానాలు
- 1000 పడకల అల్వాల్ టీమ్స్, ఎరగడ్డ టీమ్స్, గడ్డి అన్నారం టీమ్స్, 1261 బెడ్ల తో గచ్చి బౌలి టీమ్స్
- 1571 కోట్ల తో నిమ్స్ 2000 పడకల ఆసుపత్రి విస్తరణ
- 3779 కోట్ల తో వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్
- 33 మెడికల్ కాలేజీలు నిర్మాణం, 8515 మంది ఎంబీబీఎస్ సీట్లు
- 585 కోట్ల తో పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్
- 137 పోలీసు భవనాల నిర్మాణం, 654.50 కోట్లతో జిల్లా ఎస్పీ కార్యాలయాలు
- 10.13 లక్షల సీసీ కెమెరాలు
- 20,115 పోలీసు వాహనాలు
- 9 కమీషనరేట్ల ఏర్పాటు, 719 సర్కిల్స్, 164 పోలీస్ సబ్ డివిజన్ లు, 815 పోలీస్ స్టేషన్ పెంపు
- కాళేశ్వరం ప్రోజెక్ట్ నిర్మాణం, పాలమూరు రంగారెడ్డి ఎత్తి పోతల పథకం (35 వేల కోట్లు) ప్రారంభం
- విద్యుత్ రంగం 2014లో 7748 మెగావాట్ల నుంచి2023 లో 19, 464 మెగావాట్ల కు పెంపు
- 15497 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ ప్రస్తుతం
- వ్యవసాయానికి , గృహ వినియోగానికి 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం
- 57.82 శాతం తలసరి విద్యుత్ వినియోగం లో వృద్ధి
- లోడ్ మెయింటేన్స్ లో ట్రాన్స్ ఫార్మర్స్ బిగింపు
- 2014 లో విద్యుత్ సంస్థల అప్పు 22,423 కోట్లు, 2023 లో 81 వేల కోట్లు
- 2014 లో 44,431 కోట్ల విద్యుత్ ఆస్తులు
- 2023 లో 1,37, 571 కోట్ల పెరిగిన విద్యుత్ ఆస్తులు
- 59 వేల కోట్ల అప్పులు, 93 వేల కోట్ల ఆస్తుల పెరుగుదల
- ఎస్సీ ఎస్టీల సంక్షేమం కోసం ఈ 10 ఏళ్లలో 70, 965.75 కోట్ల తో నిధులు ఖర్చు
- దళిత బంధు పథకం అమలు
- 5000 కోట్లతో గొర్రెల పంపిణీ
- 72,817 కోట్ల రైతు బంధు నిధుల విడుదల
- 5402 కోట్ల రైతు బీమా
- 572 కోట్ల తో రైతు వేదికల ఏర్పాటు
- 1,98, 37 వేల ఎకరాల మేర పెరిగిన పంట విస్తీర్ణం
- గ్రామాల్లో 100 శాతం మంచి నీటి సౌకర్యం, స్కూళ్ళు, అంగన్వాడీ లు, ప్రభుత్వ సంస్థల్లో నీటి సౌకర్యం
- 8735.32 కోట్ల తో మిషన్ కాకతీయ, 21, 633 చెరువుల పునరుద్ధరణ
- 617 కోట్ల తో కొత్త సచివాలయం నిర్మాణం*
- 146.50కోట్ల తో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం నిర్మాణం
- 178 కోట్లతో 3ఎకరాల్లో అమరవీరుల స్మారక జ్యోతి
- 2014 లో 27, 200 కోట్ల సేల్స్ టాక్స్ 2023 లో 72564 కోట్ల వసూళ్లు
- 2014 లో 2832 కోట్ల రిజిస్ట్రేషన్ ఆదాయం ప్రస్తుతం 14, 291 కోట్ల వసూలు
- 2014 లో 1,24,104 కోట్లు ఉన్న తలసరి ఆదాయం 2023 లో 3.12,398 కోట్ల పెరిగిన తలసరి ఆదాయం
- 159.6 పెరిగిన తలసరి ఆధాయం

# నేడు బిజెపి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

**మొదటిపేజీ తరువాయి**

కిషన్ రెడ్డి పేర్కొన్నారు. లోక్ సభ ఎన్నికలల్లో పరాజయం తప్పదని ఇలాంటి కుట్రలకు తెరలేపాయని ఆయన విమర్శలు చేశారు. ఉపరాష్ట్రపతిని అవమానిస్తుంటే రాహుల్ గాంధీ సమర్థించారని, దీనికి గాను ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీలో బీజేపీ జాతీయ పదాధికారుల సమావేశం

బీజేపీ జాతీయ పదాధికారుల సమావేశం ఢిల్లీలో జరగనుంది. ఈనెల 22, 23 తేదీల్లో ఈ సమావేశం జరగనుంది. కాగా ఇటీవల ఐదు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో వచ్చిన ఫలితాలపై పోస్టుమార్టం చేయడంతో పాటు త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల సంసిద్ధతపై జాతీయ నాయకత్వం దిశానిర్దేశం చేయనుంది. ఈ మీటింగ్ కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎంపీలు లక్ష్మణ్, బండి సంజయ్ హాజరుకానున్నారు.

# కోమటిరెడ్డి ప్రతీక్ యాదిలో ..

- 12 వర్ధంతి సందర్భంగా స్వచ్ఛంద కార్యక్రమాలు
- మంత్రి నివాసం, 'ప్రతీక్' కాలేజీలో నివాళులు
- భారీగా స్వచ్ఛందంగా రక్తదానం చేసిన యువత
- కాలేజీలో కాన్ఫరెన్స్ హాల్ ప్రారంభం
- స్టూడెంట్లకు నోట్‌బుక్స్, శానిటేషన్ సిబ్బందికి బట్టలు పంపిణీ
- పలు కార్యక్రమాలలో పాల్గొన్న మంత్రి అల్లుడు ప్రణవ్ రెడ్డి



**విశాల భారతి, నల్గొండ:** రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కుమారుడు ప్రతీక్ రెడ్డి 12వ వర్ధంతి సందర్భంగా బుధవారం నల్గొండ పట్టణంలో పలు స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రి నివాసంతో పాటు కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రతీక్‌ను యాది చేసుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కాలేజీ ఆవరణలో యాజమాన్యం నిర్వహించిన రక్తదాన శిబిరంలో యువత, పార్టీ శ్రేణులు, కోమటిరెడ్డి అభిమానులు భారీ సంఖ్యలో హాజరై రక్తదానం చేశారు. కాలేజీలో కొత్తగా నిర్మించిన కాన్ఫరెన్స్ హాల్ ను మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్, పోటీ పరీక్షలకు సంబంధించి మెటీరియల్ ప్రతీక్‌ఫౌండేషన్ సీఈవో గోనారెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. కాలేజీలో నిర్వహించిన ఆయా కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు వెల్లువలా తరలివచ్చారు. నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డితో పాటు పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు రక్తదానం చేశారు. 260 మందికి పైగా రక్తదానం చేశారని ప్రతీక్‌ఫౌండేషన్‌సీఈవో గోనారెడ్డి మీడియాకు తెలిపారు.

**రోగులకు పండ్ల పంపిణీ**

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా మరియామాత చర్చిలో ప్రతీక్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనాథ ఆశ్రమాలలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ప్రతీక్ రెడ్డి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన పలు కార్యక్రమాల్లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అల్లుడు ప్రణవ్ రెడ్డి, నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, ప్రతీక్ ఫౌండేషన్ సీఈవో ఎంవీ గోనారెడ్డి, నల్గొండ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, నల్గొండ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీ మనిమద్ది సుమన్, తిప్పర్తి జడ్పీటీసీ పాశం రామ్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, తిప్పర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూకూరి రమేశ్, కనగల్ మాజీ జడ్పీటీసీ నర్సింగ్, శ్రీనివాస్ గౌడ్, ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఏసీహెచ్‌పుల్లారావు, డాక్టర్ ఎన్సీ రాములు, కౌన్సిలర్లు జూలకంటి శ్రీనివాస్, కరుణాకర్ రెడ్డి, ఇంతియాజ్, సమీర్, బొజ్జ శంకర్, బాబా, బోగరి ఆనంద్, బుర్రి రజిత యాదయ్య, ఇబ్రహీం, నవీన్ కుమార్ సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.






# మళ్లీ కోరలు చాస్తున్న కరోనా

**మొదటిపేజీ తరువాయి**

14 మంది ఐసోలేషన్ లో ఉన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయటకు వెళ్తే తప్పనిసరిగా మాస్కులు ధరించాలని హెచ్చరించింది. మరోవైపు దేశంలో బుధవారం ఒక్కరోజు 614 కేసులు, 3 మరణాలు నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది.

దేశంలో వేగంగా విస్తరిస్తున్న కరోనా కొత్త వేరియంట్ జేఎన్ 1 మహమ్మారి కట్టడిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని రాష్ట్రాల వైద్య, ఆరోగ్య శాఖ మంత్రులతో ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ లో తెలంగాణ వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కరోనా కొత్త వేరియంట్ జేఎన్ - 1 మహమ్మారి కట్టడి పై తీసుకుంటున్న ముందస్తు చర్యలను మంత్రి వీడియో కాన్ఫరెన్స్ లో వెల్లడించారు.

కోవిడ్ పాజిటివ్ వచ్చి తీవ్రమైన లక్షణాలతో ఉన్న రోగులు ప్రభుత్వ కోవిడ్ ఆసుపత్రిలో చికిత్స తీసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం కరోనా పరీక్షలు, రోగులకు అవసరమైన సదుపాయాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వివరించింది. ప్రతి ఒక్కరూ ముఖానికి మాస్క్ ధరించడం, భౌతిక దూరం పాటించడం, సానిటైజ్ చేసుకోవడం లాంటివి చేయాలని సూచించింది. 10 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు.. 60 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న పెద్దలు తప్పనిసరి అయితే తప్ప బయటకు రావొద్దని తెలిపింది. అనవసరమైన ప్రయాణాలకు ఉండాలని పౌరులను అభ్యర్థించింది. జ్వరం, దగ్గు, జలుపు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, శరీర నొప్పులు, తలనొప్పి ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచనలు చేసింది.

# తబ్లీగి జమాత్ కు ప్రోత్సాహం ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**

సౌదీ అరేబియానే తబ్లీగి జమాత్ సంస్థను నిషేధించిందని, టెర్రరిజం వ్యాప్తికి కారణమవుతోందనే ఆ దేశం బ్యాన్ చేసిందన్నారు. అలాంటిది రాష్ట్ర ప్రభుత్వం ఆ సంస్థ గురించి ఇంటలిజెన్స్ ద్వారా కూడా కనీస సమాచారం తెలుసుకోకుండా, అధికారులను సంప్రదించకుండా.. శాశ్వత ప్రాతిపదికన మంచినీటి పైపులు, పార్కింగ్ లాంటి సౌకర్యాల కల్పనకు వక్ఫ్ బోర్డు నిధులు అందించడం శోచనీయమని రచనారెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఏమీ తెలుసుకోకుండా రూ.3 కోట్ల నిధులు ఎలా మంజూరు చేవారో చెప్పాలని ఆమె ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన రూ.3 కోట్లను వాపస్ తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సంస్థకు నిధులు ఇచ్చిన కాంగ్రెస్.. రైతు భరోసాకు ఎందుకు ఇవ్వ లేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని రచనారెడ్డి డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఎంఐఎం నేతలు ఎవరు అధికారంలో ఉంటే వారితో అంటకాగుతారని, ఆరుగురు సీనియర్లను కాదని ప్రొటెం స్పీకర్ గా అక్బరుద్దీన్ ను నియమించడం వెనుకున్న ఆంత్యమేంటని ఆమె విమర్శలు గుప్పించారు. ఆ తుక్ డే.. తుక్ డే గ్యాంగ్ తో ఏం చేయాలని అనుకుంటున్నారని ఆమె ఫైరయ్యారు.

# సైకో జగన్ పాలనలో తొలిసారి దండయాత్రలు చూశా

**మొదటిపేజీ తరువాయి**

పెరిగాయి. వైసీపీ నేతలు మెడపై కత్తిపెట్టి ఆస్తులు రాయించుకుంటున్నారని ఆరోపించారు.

గతంలో విశాఖ ఆర్థిక రాజధానిగా ఉండేది. ప్రస్తుతం విశాఖ గంజాయికి రాజధానిగా మారింది. రాష్ట్రంలో విధ్వంస పాలనకు జగన్ నాంది పలికారు. ఒక్క ఛాన్స్ ఇస్తే రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కు వెళ్లింది. వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్‌గా మారాలి. అమరావతిని సర్వనాశనం చేసి మూడు ముక్కలాట ఆడారు. రుషికొండను బోడిగుండుగా మార్చారు. సీఎం విల్లా కోసం రూ.500 కోట్లు ఖర్చుపెట్టారు. త్వరలో ఉమ్మడి మేనిఫెస్టో తయారు చేస్తాం. అమరావతి, తిరుపతిలో సభలు నిర్వహిస్తాం. అమరావతి లేదా తిరుపతి సభలో మేనిఫెస్టో ప్రకటిస్తాం. ఇప్పటికే మహాశక్తి కార్యక్రమానికి శ్రీకారం చేపట్టాం. 20 లక్షల మందికి ఉపాధి కల్పన బాధ్యత తీసుకుంటాం. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి అందిస్తాం. అన్నదాత కార్యక్రమం ద్వారా రైతులకు ఆర్థికసాయం. బీసీల కోసం రక్షణ చట్టం తీసుకువస్తాం. అగ్రవర్ణాల పేదలను ఆర్థికంగా ఆదుకుంటాం. కురుక్షేత్ర యుద్ధంలో వైసీపీ ఓటమి ఖాయం". చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# గడలకు ఝలక్

- ప్రాధాన్యత లేని పోస్టులోకి బదిలీ
- డీహెచ్ గా రవీంద్ర నాయక్



**విశాల భారతి, హైదరాబాద్:** రాష్ట్రంలో కొలువుదీరిన రేవంత్ రెడ్డి సర్కార్ వివిధ శాఖలలోని ఉన్నతాధికారులను బదిలీ చేస్తోంది. ఇప్పటికే పలవురు ఐఏఎస్, ఐపీఎస్ లకు స్థానచలనం కల్పించిన ప్రభుత్వం.. తాజాగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌గా డాక్టర్ రమేశ్ రెడ్డి స్థానంలో త్రివేణిని నియమించింది. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ గడల శ్రీనివాసరావు స్థానంలో డాక్టర్ రవీంద్ర నాయక్‌ను నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.కాగా డీహెచ్‌గా పని చేసిన గడల శ్రీనివాసరావు గత ప్రభుత్వంతో సన్నిహితంగా మెలిగారనే ఆరోపణలు ఉన్నాయి. కొత్తగూడెం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయబోతున్నానని, కేసీఆర్ తనకు టికెట్ ఇస్తారని చివరి వరకు ఆశలు పెట్టుకున్నారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున నియోజకవర్గంలో పర్యటనలు చేస్తూ ప్రజలకు చేరువ అయ్యే ప్రయత్నాలు చేశారు. కానీ గులాబీ అధినేత టికెట్ నిరాకరించడంతో సైలెంట్ అయ్యారు. ఈ క్రమంలో అతడి వైఖరిపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తం కాగా తాజాగా రేవంత్ రెడ్డి సర్కార్ అతడికి స్థాన చలనం కల్పించింది.

# తెలంగాణ అప్పులు..రూ. 6.71 లక్షల కోట్లు

**మొదటిపేజీ తరువాయి**

వనరులను సక్రమంగా ఉపయోగించలేదు. దశాబ్దకాలంలో జరిగిన ఆర్థిక తప్పిదాలు ప్రజలకు తెలియాలి. ఆర్థిక సవాళ్లను బాధ్యతాయుతంగా అధిగమిస్తాం. సవాళ్లను అధిగమించే దిశలో శ్వేతపత్రం మొదటి అడుగు' అంటూ భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన శ్వేత పత్రంల లెక్కలు ఇలా..**

- తెలంగాణ మొత్తం అప్పులు రూ.6,71,757 కోట్లు
- 2014- 15 నాటికి రాష్ట్ర రుణం రూ.72,658 కోట్లు
- 2014- 15 నుంచి 2022- 23 మధ్య కాలంలో 24.5 శాతం పెరిగిన అప్పు
- 2023- 24 అంచనాల ప్రకారం రాష్ట్ర రుణం రూ.3,89,673 కోట్లు
- 2015- 16లో రుణ, జీఎస్డీపీ 15.7 శాతంతో దేశంలోనే అత్యల్పం
- 2023 -24 నాటికి 27.8 శాతానికి పెరిగిన రుణ, జీఎస్డీపీ శాతం
- బడ్జెట్‌కు, వాస్తవ వ్యయానికి మధ్య 20 శాతం అంతరం
- 57 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధికి రూ.4.98 లక్షల కోట్ల వ్యయం
- రాష్ట్రం ఏర్పడిన తర్వాత 10 రెట్లు పెరిగిన రుణభారం

**అసలు విషయం చెప్పడానికే శ్వేత పత్రం..**
**– ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామెంట్స్**

అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రపంచంతో పోటీ పడాలని తమ లక్ష్యమన్నారు. బడ్జెట్లను కొలమానంగా తీసుకున్నాం.. రెవెన్యూ ఖర్చుల విషయంలో కాగ్ ని పరిగణలోకి తీసుకున్నామన్నారు. లోన్ల విషయంలో ఆర్బీఐని పరిగణలోకి తీసుకున్నాం.. ఉద్యోగుల అంశంలో కాగ్ ని పరిగణలోకి తీసుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆదాయం, అవసరాల పై ఆర్బీఐ నిత్యం వివరాలు అందిస్తుందన్నారు.

మరోవైపు.. హరీశ్ రావు ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు 35 రోజులు మాత్రమే మిగులు నిధులు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్రం ఇచ్చినప్పుడు 303 రోజులు ఆర్బీఐ దగ్గర మిగులు నిధులు ఉండేవన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాకా ఐదేళ్లలో సగం రోజులో కూడా డబ్బులు లేవని ఆరోపించారు. రోజు ఆర్బీఐ దగ్గర జీతాలకు డబ్బులు ఇవ్వండి అని ఆడుకునే పరిస్థితి తెచ్చారు గత పాలకులు అని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా బ్యాంక్ లో అప్పు పుట్టని పరిస్థితి ఏర్పడిందని సీఎం తెలిపారు. తప్పును తప్పుగా చెప్పకపోతే మనం కూడా తప్పులో భాగస్వామ్యం అయినట్టేనని పేర్కొన్నారు.

శ్వేత పత్రం ఎవరినో నిందించడానికి పెట్టలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇన్నాళ్లు గొప్పగా చేశాం అంటున్నారు కాబట్టి.. అసలు విషయాలు చెప్పడానికి శ్వేతపత్రం అని తెలిపారు. ఎవరు వ్యక్తిగతంగా తీసుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు. నివేదికలో ఎవరిని కూడా నిందించలేదు.. హరీష్ రావు పక్క రాష్ట్రం అధికారితో రాయించారు అంటున్నాడు.. ఇదా పద్ధతి అని సీఎం ప్రశ్నించారు. ఆర్థిక శాఖ కార్యదర్శి కూర్చొని రాసిందే.. మీలాగా మేము చేయమని బీఆర్ఎస్ నేతలపై దుయ్యబట్టారు. ఇదిలా ఉంటే హరీష్ రావు, వైఎస్ కలిసిన ఫోటో చూపించారు రేవంత్. ఇద్దరి మధ్య చర్చ ఏం జరిగిందో ఇప్పటికి తెలియదు.. నాతో ఎవరైనా కలిస్తే తప్పా అని అన్నారు. కిషన్ రెడ్డితో సహకారం ఉండాలని ఫోన్ చేసి మాట్లాడా.. రాజకీయాలు కోసం కాదన్నారు.ఇదిలా ఉంటే.. ప్రజలను సెక్రటేరియట్ కి పిలిచాం.. ప్రగతి భవన్ ని ప్రజా భవన్ గా మార్చామని సీఎం రేవంత్ చెప్పారు. హైదరాబాద్ లో సమస్యలపై.. ఎంఐఎం లను పిలిచి మాట్లాడామన్నారు. రాజకీయాలు వేరు.. కానీ హైదరాబాద్ ఇమేజ్ కాపాడాలి.. అందుకు అందరితో మాట్లాడతామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. దేశం కోసం ఇందిరా, రాజీవ్ గాంధీ ప్రాణ త్యాగం చేశారు.. సోనియా, రాహుల్ గాంధీ పదవి త్యాగం చేశారన్నారు. ఖర్గే అధ్యక్షతన అభివృద్ధి కోసం పని చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందరితో మాట్లాడతాం.. సీపీఎం, న్యూ డెమోక్రసి లాంటి వాళ్ళను కూడా కలిసి మాట్లాడతామని సీఎం తెలిపారు. అందరి సలహాలు, సూచనలు తీసుకుంటాం.. ఏక వ్యక్తి నిర్ణయాలు ఉండవు.. అందరి అభిప్రాయం తీసుకుని చట్టాలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

**శ్వేత పత్రం తప్పుల తడక: హరీశ్‌రావు**

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన శ్వేత పత్రం తప్పుల తడకగా ఉందంటూ బీఆర్ఎస్ పేర్కొంది. పదేండ్లలో తాము సంపాదించిన ప్రగతి ఇదిగో అంటూ బీఆర్ఎస్ ఏకంగా డాక్యుమెంటరీని రిలీజ్ చేసింది. అప్పులంటూ అనవసర రాద్ధాంతం చేస్తున్నాంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. తెచ్చిన అప్పులతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు.

# పల్లవి ప్రశాంత్ అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

ఫిర్యాదు చేశారు. మరోవైపు కృష్ణానగర్ రోడ్లపై పల్లవి ప్రశాంత్ అభిమానులతో పాటు కొందరు న్యూసెన్స్ క్రియేట్ చేయడాన్ని సుమోటోగా తీసుకుని జూబ్లీహిల్స్ పోలీసులు కేసు పెట్టారు. ఈ కేసులో పల్లవి ప్రశాంత్‌ను ప్రధాన నిందితుడిగా చేర్చారు. ఈ కేసులో మొత్తం ఐదుగురిని నిందితులుగా పేర్కొనగా.. A4, A5లను ఇప్పటికే అరెస్ట్ చేశారు. తాజాగా A1 పల్లవి ప్రశాంత్‌ను అరెస్ట్ చేశారు. పల్లవి ప్రశాంత్‌తో పాటు ఈ కేసులో A2గా ఉన్న ఆయన తమ్ముడు రవిరాజును గజ్వేలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రశాంత్ స్వగ్రామమైన గజ్వేలు మండలం కొల్గూరులో ఆయన నివాసం వద్దే అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తీసుకువస్తున్నారు. పల్లవి ప్రశాంత్‌పై మొత్తం 9 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

యూట్యూబ్‌లో వీడియోలు చేస్తూ రైతుబిడ్డగా పాపులర్ అయిన పల్లవి ప్రశాంత్.. బిగ్ బాస్ షోకి ఎంపికై వార్తల్లో నిలిచారు. రైతుబిడ్డ కావడంతో ప్రశాంత్‌ను చాలా మంది సపోర్ట్ చేశారు. తన యూట్యూబ్ వీడియోల ద్వారా అప్పటికే చాలా అభిమానులను సంపాదించిన ప్రశాంత్.. బిగ్ బాస్ హౌస్‌లో తన ఆటతో మరింత మంది ఫ్యాన్స్‌ను పెంచుకున్నారు. 105 రోజుల పాటు బిగ్ బాస్ హౌస్‌లో ఆటాడి, పోరాడి విజేతగా నిలిచారు. బిగ్ బాస్ చరిత్రలోనే విజేతగా నిలిచిన సామాన్యుడిగా, రైతుగా పల్లవి ప్రశాంత్ రికార్డు నెలకొల్పారు.

అయితే, పల్లవి ప్రశాంత్‌కు ఘన స్వాగతం పలికేందుకు బిగ్ బాస్ 7 గ్రాండ్ ఫినాలే జరిగిన ఆదివారం (డిసెంబర్ 22న) వందలాది మంది అభిమానులు అన్నపూర్ణ స్టూడియో వద్దకు చేరుకున్నారు. అలాగే, ఇతర బిగ్ బాస్ ఫైనలిస్టుల అభిమానులు కూడా వచ్చారు. కానీ, వీళ్లలో ఎక్కువ మంది పల్లవి ప్రశాంత్ అభిమానులేనని చెబుతున్నారు. సీజన్ ఆఖరిలో పల్లవి ప్రశాంత్‌తో గొడవపెట్టుకున్న అమర్‌దీప్‌పై ప్రశాంత్ అభిమానులు కోపం పెంచుకున్నారు. దీంతో రన్నర‌ప్‌గా నిలిచి భార్య, తల్లితో కలిసి కారులో అన్నపూర్ణ స్టూడియోస్ నుంచి బయటికి వచ్చిన అమర్‌దీప్‌పై పల్లవి ప్రశాంత్ అభిమానులు దాడి చేశారు. కారు అద్దం పగలగొట్టారు. రాళ్లు రువ్వారు. అలాగే, మరికొంత మంది సెలబ్రిటీల కార్లపై కూడా దాడులు చేశారు. ఇక పల్లవి ప్రశాంత్ స్టూడియో నుంచి బయటికి వచ్చిన తర్వాత పోలీసులు హెచ్చరికలు బేఖాతరు చేస్తూ ర్యాలీ తీశారు.

**ఫ్యాన్స్ బీభత్సం.. బస్సు అద్దాలు ధ్వంసం, రోడ్డుపై రచ్చ రచ్చ**

అంతకు ముందు పల్లవి ప్రశాంత్, అమర్ దీప్ అభిమానులు రోడ్లపై గొడవపడి అటుగా వచ్చిన ఆర్టీసీ బస్సులపై దాడులు చేశారు. ఆరు ఆర్టీసీ బస్సుల అద్దాలను ధ్వంసం చేశారు. దీనిపై తెలంగాణ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అభిమానం పేరుతో వికృత చేష్టలు చేస్తే చూస్తూ ఊరోకమని హెచ్చరించారు. తాము జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. సజ్జనార్ ట్వీట్ చేసిన తర్వాత జూబ్లీహిల్స్ పోలీసులు సైతం రంగంలోకి దిగారు. ఘటనను సుమోటోగా తీసుకుని పల్లవి ప్రశాంత్‌తో పాటు మరో నలుగురిపై కేసులు నమోదు చేశారు. ఇప్పటికీ అన్నపూర్ణ స్టూడియో సమీపంలో ఉన్న సీసీటీవీ ఫుటేజీలు అన్నింటినీ పోలీసులు పరిశీలిస్తున్నారు. ఆకతాయిలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

# 'నువ్వెంత మొత్తుకున్నా కేసీఆర్ తర్వాత కేటీఆరే



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు హాట్ హాట్ గా కొనసాగుతున్నాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ క్రమంలో.. కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై సభలో రభస నెలకొంది. నిన్ను కేసీఆర్, కేటీఆర్ వాడుకుని వదిలేస్తారు అని మాజీ మంత్రి హరీశ్ రావును రాజగోపాల్ అన్నారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. మొన్న జరిగిన సభలో హరీశ్ రావు రాజగోపాల్ రెడ్డిని నీకు మంత్రి పదవి రాదు అని అన్నారు. ఈ క్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. నువ్వు ఎంత కష్టపడ్డ నీకు ఏం రాదు అని హరీశ్ రావును రాజగోపాల్ రెడ్డి అన్నారు. దీంతో సభలో బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సభలో ఇలాంటి గొడవలు సరికావని మంత్రులు శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్క చెప్పారు. అనంతరం హరీశ్ రావు మాట్లాడుతూ.. రాజగోపాల్ వ్యాఖ్యలకు కౌంటర్ వేశారు. రూ.50 కోట్లు పెట్టి పీసీసీ తెచ్చుకున్నాడని విమర్శించారు. దీంతో.. మంత్రి శ్రీధర్ బాబు కలుగజేసుకుని మాట్లాడుతూ.. హరీష్ వ్యాఖ్యలు విత్ డ్రా చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. రాజగోపాల్ రెడ్డి విత్ డ్రా చేసుకుంటే తాను చేసుకుంటానన్నారు. ఈ క్రమంలో.. హరీష్ రావు వ్యాఖ్యలు రికార్డు నుండి తొలగిస్తున్నామని స్పీకర్ తెలిపారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. మా పార్టీ సీఎంగా రేవంత్ ని ఎన్నుకున్నారు.. పదేండ్లు మీరేం చేశారో చెప్పండి. మీ బావ బామ్మర్దులు ఎట్లా కొట్లాడారో చెప్పాలా'? అని హరీశ్ రావుపై విమర్శలు చేశారు.

# ప్రాజెక్టుల అవినీతిపై విచారణ జరిపిస్తాం

- బాధ్యులను శిక్షించేదాక వదిలిపెట్టం
- ఇరిగేషన్ మినిస్టర్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడీవేడీగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో.. ఇరిగేషన్‌మినిస్టర్ ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ప్రాజెక్టులపై హరీశ్ రావు విచారణ చేయండి అని అంటున్నారు.. ఖచ్చితంగా విచారణ చేస్తామని తెలిపారు. బాధ్యులను శిక్షించేదాక వదిలిపెట్టబోమని చెప్పారు. కాళేశ్వరంతో ఒక్క ఎకరం అయినా సాగు అదనంగా వచ్చిందా అని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టుకి ఎందుకు నిధులు విడుదల చేయలేదని ఆయన ప్రశ్నించారు. పాలమూరుకి రూ.25 వేల కోట్లు ఖర్చు పెడితే.. కొత్త ఆయకట్టు లేదని అన్నారు. సీతారాం ప్రాజెక్టుకి ఆయకట్టు సున్నా.. కొత్త ఆయకట్టు లేకుండా, లక్షల కోట్లు పెడితే వృధా కాదా అని మంత్రి ఉత్తమ్ అన్నారు.

మేడిగడ్డపై ఆనాటి సీఎం ఒక్క మాట మాట్లాడలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఎల్అండ్టీ మాకు ఏం సంబంధం అని అంటోంది. డిసైన్ ఇచ్చారు.. మేము కట్టాం అంతే అంటున్నారని తెలిపారు. అధికారులను అడిగితే.. ఇంకెవరు సర్.. డిజైన్ చేసేది వాళ్లే కదా అన్నారని మంత్రి ఉత్తమ్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మీద విచారణ జరుపుతాం.. బాధ్యులపై చర్యలు ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సివిల్ సప్లై శాఖ బియ్యం ఇవ్వడానికి.. వడ్లు కొనడానికి పరిమితం అయ్యిందని మంత్రి ఉత్తమ్ కుమార్ తెలిపారు. 3300 కోట్లున్న అప్పు.. 56 వేల కోట్లు పెరిగిందని ఆరోపించారు. గత సర్కార్.. నిరుపేదలకు బియ్యం ఇచ్చే శాఖకు ఇచ్చే సబ్సిడీ ఇవ్వలేదని మండిపడ్డారు. గత పాలన మూలంగా 11 వేల 500 కోట్లు నష్టం జరిగిందని తెలిపారు. 22 వేల కోట్ల ధాన్యం రైస్ మిల్లర్ల దగ్గర పెట్టారు.. వివరాలు కూడా లేవన్నారు. కర్ణాటక, తమిళనాడు ప్రభుత్వం రైస్ కొంటామని అడిగింది.. స్టాక్ ఉన్నా అమ్మలేదని ఉత్తమ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ రాజకీయ కారణాలతో ఉన్న ధాన్యం కూడా అమ్మలేదని మంత్రి ఆరోపించారు.

# మునుగోడుకు ప్రత్యేక నిధులివ్వండి

- మంత్రి కోమటిరెడ్డిని కోరిన జగన్ యాదవ్
- గ్రామాల్లో బీటీరోడ్లు, బిల్డింగ్స్ నిర్మించాలని విజ్ఞప్తి



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్నా.. అభివృద్ధిలో వెనుకబడిన మునుగోడు నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు బట్టు జగన్‌యాదవ్‌కోరారు. బుధవారం నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసి హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సన్మానించి, పూల బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. గత బీఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యం వల్ల మునుగోడు నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక నిధులు ఇచ్చి గ్రామాల్లోని లింక్ రోడ్ల ను బీటీ రోడ్లుగా అభివృద్ధి చేయాలని, గ్రామ పంచాయతీ భవనాలను నిర్మించాలని కోరారు. రాచకొండ పరిధిలో సినిమా పరిశ్రమ నెలకొల్పి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో చంద్రశేఖర్ రెడ్డి , రమేష్ నాయక్, శ్రీను, కొండేటి వెంకటయ్య, శ్రీశైలం, చంద్రయ్య, ప్రశాంత్, మహేందర్ తదితరులు ఉన్నారు.

# మంత్రి కొండా సురేఖ ఔదార్యం

- చిన్నారి వైద్యం కోసం సీఎంను కలిసిన అటవీశాఖ మంత్రి
- తక్షణ వైద్య సాయం అందించాలని రేవంత్ రెడ్డి ఆదేశం




**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** కొత్తగా బాధ్యతలు చేపట్టిన తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఎవరికైనా సహాయం చేయాలంటే ముందు వరుసలో నిలిచే సురేఖ వరంగల్‌లోని నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారి వైద్య చికిత్స కోసం ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సత్వర సహాయాన్ని అందించి, చిన్నారి క్షేమంగా ఇల్లు చేరుతుంది అంటూ ఆ తండ్రికి భరోసా ఇచ్చారు. హన్మకొండ జిల్లాలోని రెడ్డి కాలనీకి చెందిన మహమ్మద్ నసీమ్ హైమద్ దంపతులకు ఇద్దరు అబ్బాయిలు. చిన్న అబ్బాయి ఎండీ ఆదిల్ హైమాద్‌కు కొంత కాలంగా బోన్ క్యాన్సర్‌తో బాధ పడుతున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి వైద్యం చేయించలేక పేదరికంతో బాధపడుతున్న ఆ కుటుంబం మంత్రి కొండ సురేఖను కలిసి వారి బాధను విన్నవించారు. ఆ కుటుంబం పడుతున్న వ్యధకు చలించిపోయిన మంత్రి కొండ సురేఖ వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి సమస్య తీవ్రతను తెలియజేశారు.

వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. పిల్లాడి చికిత్సకు అయ్యే ఖర్చు ప్రభుత్వం భరిస్తుందని హామీ ఇచ్చారు. పేద ప్రజల వైద్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆపదలో ఉన్న రోగులను ఆదుకునేందుకు అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి కొండ సురేఖ స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఆర్థిక స్థోమత కారణంగా ఎవరు దిగులుపడవద్దని, ప్రజా ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి అండగా ఉన్నారని మంత్రి సురేఖ భరోసా ఇచ్చారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేద ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ప్రజా వైద్య సమస్యల దృష్ట్యా ఆరోగ్య శ్రీ రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు రాష్ట్ర అటవీశాఖ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ. దీంతో మంత్రికి మహమ్మద్ నసీమ్ హైమద్ దంపతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ను కలిసిన పార్వతపూర్ గ్రామస్తులు

**మేడిపల్లి, విశాల భారతి:** తెలంగాణ శాసనసభ సభాపతిగా నియమితులైన తొలి దళిత వ్యక్తిగా నిలిచిన గడ్డం ప్రసాద్ కుమార్ ని వారి స్వగృహంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఆడాల అమర్నాథ్ ఆధ్వర్యంలో పార్వతపురం గ్రామస్థులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియచేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పీకర్ రానున్న రోజుల్లో శాసనసభను హుందగా నడిపించడానికి కృషిచేస్తారని.. అలాగే అర్ధవంతమైన చర్చలు సభలో జరిగేల వ్యవహరిస్తానని వారు అన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిర్జాదిగూడ నాలుగవ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆడాల నరసింహ , మూడవ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సుదర్శన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జలగం శరత్ గౌడ్ , NNK దుర్గ బాలాజీ ఎన్‌క్లేవ్ కాలనీ అధ్యక్షుడు , కపిల్ తదితరులు పాల్గొన్నారు.






# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**షాబాద్, విశాలభారతి:** పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెల్స్పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య తెలిపారు. బుధవారం షాబాద్ మండల కేంద్రంలోని చిన్న సోలిపేట్ గ్రామంలో గ్రామ సర్పంచి రమ్య రామ చంద్ర రెడ్డి, చేవెళ్లకు చెందిన పట్నా మహేందర్ రెడ్డి మెడికల్ కళాశాల వైద్యులు శిక్షణ శిబిరం ఏర్పటు చేశారు. ప్రజలకు ఉచితంగా వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 243 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 37 మందిని ఆపరేషన్ కోసం గుర్తించారు. వారిని గురువారం ఉదయం ప్రత్యేక బస్సుల్లో తీసుకెళ్లి ఆపరేషన్ చేస్తామన్నారు. వైద్య సిబ్బంది , గ్రామస్తులు పాల్గొన్నారు.




# ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి పనులు

**తుర్కయంజాల్, విశాలభారతి:** ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు చేపడతామని, తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని 18వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు, దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పీసీసీ సభ్యులు, కౌన్సిలర్ కాకుమాను సునీల్ అన్నారు. కమ్మగూడ శాంతినగర్ కాలనీలో రూ.16లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను సునీల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రంగారెడ్డి, చైర్‌పర్సన్ అనురాధ రాంరెడ్డి, వైస్ చైర్ పర్సన్ హరితాధన్‌రాజ్‌గౌడ్ సహకారంతో వార్డును అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కె. ప్రభాకర్, కాలనీ వాసులు రాములు, రాజేష్ రెడ్డి, చెన్నారెడ్డి, తిరుపతయ్య, రవి నాయక్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# యాత్రికులకు మహాదేవ్ టూర్స్ అండ్ ట్రావెల్స్ బంపరాఫర్

**ట్రావెల్ ఎక్స్పో మేళా 2024 ద్వార భారీ డిస్కౌంట్ తో పాటు రకరకాల ప్యాకేజీలు**



**కూకట్ పల్లి, విశాల భారతి:** నూతన సంవత్సర సందర్బంగా యాత్రికులకు శ్రీ మహాదేవ్ టూర్స్ అండ్ ట్రావెల్స్ వారు ట్రావెల్స్ ట్రావెల్ ఎక్స్పో మేళా 2024 నూతన ప్యాకేజీలు, డిస్కౌంట్ లు అందిస్తోంది. ఈ ఆఫర్ డిసెంబర్ 23 నుండి జనవరి 26 వరకు నిర్వహిస్తోందని యాత్రికులకు తెలియజేయడానికి గర్వపడుతున్నామని సంస్థ నిర్వాహకులు మేనేజింగ్ డైరెక్టర్ సురేంద్ర రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం ఓ ప్రకటనను విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాల ప్రకారం శ్రీ మహాదేవ్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఎక్స్పో మేళాలో బుకింగ్ చేసుకున్నవారికి ఏ సంవత్సరం లేని విధంగా భారీ డిస్కౌంట్ తో రకరకాల ప్యాకేజీలతో మీ ముందుకు వచ్చేసిందని అన్నారు. ఈ ట్రావెల్ ఎక్స్ పోలో అడ్వాన్స్ కట్టి బుకింగ్ చేసుకున్న వారు 2024 డిసెంబర్ 31 లోపు మీరు ఏ ప్యాకేజీలకైనా డిస్కౌంట్ సౌకర్యం పొందవచ్చని అన్నారు. లక్కీ డిప్ ద్వారా బంపర్ డ్రాలో ఎంపికైన మొదటి ఐదుగురు యాత్రికులకు ఉచితంగా దుబాయ్ సింగపూర్, శ్రీలంక, కాశీ, గుజరాత్ యాత్రలు చేసే అవకాశాన్ని కలిపిస్తున్నట్లు తెలిపారు. ట్రావెల్ ఎక్స్పో మేళా 2024 హైదరాబాద్ కూకట్ పల్లిలోని కార్యాలయం నందు సంప్రదించాలని కోరారు. పూర్తి వివరాలకు ఎండి సురేంద్ర రెడ్డి ని పలు ఫోన్ ద్వారా 9490391100, 7799960220, 7799960210, 7799960217, 7799960218, 7799960215, 7799962220 సంప్రదించాలని తెలిపారు.

# రైతులందరూ సకాలంలో ఋణాలు చెల్లించాలి




**షాబాద్, విశాలభారతి:** సహకార సంఘంలోని రైతులు దీర్ఘకాలిక రుణాలను వెంటనే చెల్లించాలని సహకార సంఘం చైర్మన్ జిల్లా శేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రములో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘంలో రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని సూచించారు. క్రాపు లోన్ తీసుకున్న రైతులందరూ సకాలంలో ఋణాలు వడ్డీతోసహ చెల్లించి మళ్లీ ఋణాలు తీసుకోవచ్చని తెలిపారు. తమ సంఘం ద్వారా ఇప్పటికే బంగారంపై, ఎల్టి రుణాలు అందించినట్లు తెలిపారు. మొత్తం 973 మంది రైతులు రూ.23.28 కోట్లు ఏల్టి ఋణలు, 820 మంది రైతులకు రూ.5.56 కోట్లు క్రాప్ ఋణాలు, 445 మందికి 5.18 కోట్లు బంగారంపైరుణాలు, 1996 మంది రైతులకు సంబంధించి రూ 65.56 లక్షలు జమ, 6మంది కి చెందిన రూ 31, 31లక్షల ఫిక్సెడ్ డిపాజిట్లు సహకార సంఘం లో ఉన్నట్లు తెలిపారు. సరదానగర్ సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కోల్డ్ స్టోరేజ్, గోదాం , స్మాల్ స్టోరేజ్ కు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 22వ తేదీ నుండి వచ్చే సంవత్సరం జనవరి 3 తేదీ వరకు టెండర్ల స్వీకరించినట్లు తెలిపారు. జనవరి 3వ తేదీ అందరి సమక్షంలో తేరువన్నట్లు తెలిపారు. సెట్టర్ మినీ గోదాం టెండర్ పత్రంలకు ఐదువేలు , ఓల్డ్ స్టోరేజ్ టెండర్ దరఖాస్తులకు రూ. 10,000 చెల్లించి దరఖాస్తు పత్రాలు పొందాలన్నారు. పూర్తి వివరాలు కోసం షాబాద్ సహకరా సంఘం కార్యాలయం ఫోన్ నెంబర్ 9010200322కి సంప్రదించాలని కోరారు.

# అత్యున్నత విశ్వవిద్యాలయంలో సీటు సాధించిన కళ్యాణ్ గౌడ్



**zచిట్యాల, విశాలభారతి:** చిట్యాల మండలం తాళ్లవెల్లంల గ్రామ సర్పంచ్ జనగాం రవీందర్ కుమారుడు జనగాం కళ్యాణ్ గౌడ్ ప్రపంచంలోనే అత్యుత్తమై నటువంటి లండన్ విశ్వ విద్యాలయంలో(ఎమ్మెస్సీ) ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ విభాగంలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు గ్రామ సర్పంచ్ జనగాం రవీందర్ మంగ మాట్లాడుతూ అత్యుత్తమైన టువంటి విశ్వవిద్యాలయంలో తమ కుమారుడికి సీటు లభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా ఒక మారుమూల ప్రాంతం నుండి చదువులు ఆసక్తి కనబరుస్తూ అంచలంచెలుగా ఎదిగి ఎందరో మహానుభావులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, ఉర్జిత్ పటేల్, నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ లాంటి ఎందరో మహానుభావు లు చదివినటువంటి విశ్వ విద్యాలయంలో మా కుమారుడు చదవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

# పదేళ్లలో రాష్ట్రం అప్పులమయం

- ఎమ్మెల్యే మదన్ మోహన్



**విశాలభారతి, హైదరాబాద్:** పదేళ్లలో తెలంగాణను అప్పులమయం చేశారని, కేసీఆర్ హయాంలో తెలంగాణ ధనిక రాష్ట్రమని చెప్పారు... కానీ అందులో వాస్తవం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీపేదల కోసం ఆరు గ్యారెంటీలు కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. బుధవారం శాసనసభ సమావేశాల నేపథ్యంలో మాట్లాడుతూ అప్పుల బారినపడి గ్రామాల్లో సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. అసలు గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థ లేదన్నారు. తెలంగాణ ఎక్కడ నెంబర్ వన్ అయింది? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 75 లక్షల కుటుంబాలు బీపీఎల్ కింద ఉన్నట్లు తెలిపారు. అన్ని రాష్ట్రాలలో ఐటీ అభివృద్ధి జరిగినట్లే ఇక్కడా జరిగిందన్నారు. బీఆర్ఎస్ చెప్పుకోవడం తప్ప చేసిందేమీ లేదని ఆరోపించారు.

# వీఆర్ఏలకు ఆడుకోండి

**వీఆర్ఏల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మీసాల సునీల్**



**సూర్యాపేట, విశాలభారతి:** రాష్ట్ర ప్రభుత్వం గత ఐదు నెలలుగా పెండింగ్లో ఉన్న వీఆర్ఏల వేతనాలను చెల్లించి ఆదుకోవాలని వీఆర్ఏల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మీసాల సునీల్ కోరారు. జిల్లా కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం వీఆర్ఏలను క్రమబద్ధీకరిస్తూ ఇతర శాఖల్లో సర్దుబాటు చేసిందని ఆయా విభాగాల్లో చేరిన మాకు ఇప్పటి వరకు గుర్తింపు కార్డు కూడా ఇవ్వలేదని తెలిపారు. గత ఐదు నెలలుగా జీతభత్యాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ఒకచోట ఉంటూ మరోచోట విధులు నిర్వహించాల్సిన పరిస్థితి వచ్చిందని కనీసం ఇల్లు గడిచే పరిస్థితి కూడా లేదన్నారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వీఆర్ఏల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని కోరారు.

# కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలు తగవు

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి**



**సూర్యాపేట, విశాలభారతి:** కేంద్ర ప్రభుత్వం పార్లమెంటును సొంత పార్టీ కార్యాలయం లాగా వాడుకుంటూ బిల్లులు, చట్టాల పైచర్చ లేకుండా ఏకపక్షంగా నిరంకుశంగా ప్రతిపక్ష పార్టీల ఎంపీలను సస్పెండ్ చేయడం చేయడం సరైన పద్ధతి కాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో జరిగిన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ లో బిజెపి ప్రభుత్వం వ్యవహరించిన తీరు బాగా లేదన్నారు. ప్రతిపక్ష ఎంపీలనుసస్పెండ్ చేసి బిల్లులను పాస్ చేసుకోవడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటన ఎమర్జెన్సీ తలపించే విధంగా ఉందన్నారు. పార్లమెంట్ లోకి కొద్దిమంది అక్రమంగా ప్రవేశించి పొగ గొట్టాలు వేయడం అంటే దేశ రక్షణ ఎలా ఉందో దీన్నిబట్టిఅర్థం అవుతుంది అన్నారు. పార్లమెంటుకే రక్షణ కరువైన పరిస్థితుల్లో దేశ ప్రజలకు రక్షణ ఎలా కల్పిస్తారో బిజెపి నేతలు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి బిజెపి ప్రభుత్వం కాలం గడుపుతుందని విమర్శించారు. దేశ ప్రజలు చైతన్యవంతులు అని వచ్చే ఎన్నికల్లో బిజెపి దాని మిత్రపక్షాలను ఓడించడం ఖాయమన్నారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక,మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా దేశంలో ఉన్నప్రజాస్వామిక వాదులు,సెక్యులర్ శక్తులను కలుపుకొనిఎన్నికల్లో పనిచేస్తామన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్లమెంట్ నుండి ప్రతిపక్ష పార్టీ లను బరిష్కరించడానికి వ్యతిరేకిస్తు ఈనెల 22న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.



# కాలువలకు నీటిని విడుదల చేయాలి

**ఎం.డేవిడ్ కుమార్ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి**

**నూతనకల్, విశాలభారతి:** బిఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాల వలన కెసిఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దెదించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అరు గ్యారెంటీలను కూడా అమలు చేయాలని లేని పక్షంలో ప్రజలు ఉద్యమాల బాట పట్టి ఈ ప్రభుత్వాన్ని కూడా నిలదీస్తారని సీపీఐ (ఎం_ఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్ కుమార్ అన్నారు. నూతనకల్ మండలంలో గునుగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్రంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ సమావేశం జాజుల సామెలు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో ఎస్అర్ఎస్పి కాలువలకు నీటిని విడుదల చేసి చెరువులు,కుంటలు నింపాలని, కాలువులకు గండ్లు పడకుండా సిమెంట్ లైనింగ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు బందు ను 15 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారని ,రైతులు పంట సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. తక్షణమే స్పందించి రైతు బంధును రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు,వైద్యం,విద్య పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అనేక బాధలు బిఆర్ఎస్ పాలనలో అనుభవించారన్నారు.



# ఆపరేషన్ స్మైల్ స్పెషల్ డ్రైవ్

- బాలలకు మంచి భవిష్యత్తు ఇవ్వడం అందరి బాధ్యత
- బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో అందరూ భాగస్వామ్యం కావాలి

**సూర్యాపేట, విశాలభారతి:** జనవరి నెలలో నిర్వహిస్తున్న 10వ విడత ఆపరేషన్ స్మైల్ కార్యక్రమానికి సంబంధించి అధికారులతో బుధవారం జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే జిల్లా పోలీస్ కార్యాలయం అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, మానవ అక్రమ రవాణ నిరోధం, తప్పిపోయిన బాలల గుర్తింపు, నిరాదరణకు గురైన పిల్లల సంరక్షణ లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్, జులై నెలలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. దీనిలో భాగంగా ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాల ద్వారా నిరాధారణకు గురైన తప్పిపోయిన మరియు వెట్టి చాకిరికి గురవుతున్న బాలలను సంరక్షించడం జరుగుతుందని తెలిపారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, లక్ష్యం కోసం పని చేయాలని అన్నారు. మెకానిక్ షాప్స్, ఇండస్ట్రీ లు, వలస కూలీలు, ఇటుకల తయారీ పరిశ్రమలు, మైన్స్, హోటల్స్, దాబాలు, ఇందన అవుట్ లెట్స్, గోదాములు లాంటి వాటిల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం అన్నారు. వెట్టి చాకిరికి గురవుతున్న, తప్పిపోయిన మరియు నిరాధారణకు గురవుతున్న బాలలను గుర్తించి సంరక్షణ కేంద్రాలకు తరలించడం, తల్లిదండ్రులకు అప్పగించడం జరుగుతుంది అని తెలిపినారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ రవి, సి డబ్ల్యూ సి చైర్మెన్ రమణారావు, లేబర్ కమిషనర్ మంజుల, డిఎం హెచ్ వో కోటా చలం, జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ తదితరులు ఉన్నారు.




# ఘనంగా ఆదరణ దినోత్సవం

**మరిపెడ, విశాలభారతి:** బాలవికాస అధర్వంలో మరిపెడ బంగ్లాలోని బాల వికాస ఆఫీస్ లో ఆనాధ వృద్ధుల మీటింగ్ పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాల వికాస ప్రోగ్రామ్ మేనేజర్ లుర్ఫ్ మా రెడ్డి, బాలవికాస ప్రోగ్రాం మేనేజర్ లతా ప్రతాప్ రెడ్డి, అమూల్య, ఎంపీపీ అరుణ రాంబాబు నాయక్ జడ్పిటిసి శారద రవీందర్ నాయక్,. సూర్య పెర్టిలైజర్ ఉప్పల కృష్ణ మూర్తి,మహాలక్ష్మి, తొర్రూర్ మండల కోఆర్డినేటర్ హాజరయ్యారు. ఈకార్యక్రమంలో మండల కో ఆర్డినెటర్ ఉపేంద్ర మాట్లాడుతూ కడుపున పుట్టిన పిల్లలు ఎవరు లేని వృద్ధులను తీసుకొని వాళ్ళకి 3 నెలలకి సరిపడ 25 కేజీల బియ్యం, నిత్యవసర వస్తువులు, ఒక ట్రంక్ పెట్టే పంపిణీ చేశారు.



# బస్సు సర్వీస్ ను పునరుద్ధరించాలి

**రామన్నపేట, విశాల భారతి:** నార్కట్ పల్లి డిపో పరిధి నుండి రామన్నపేట నుండి వేములకొండ వరకు వెళ్ళే ఆర్టీసీ బస్సును పునరుద్ధరించి ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని కోరుతూ నార్కట్ పల్లి డిపో మేనేజర్ వెంకటమ్మ, సూపరిండెంట్ నరసింహలకు వైస్ ఎంపిపి నాగటి ఉపేందర్ నీర్నేముల, లక్ష్మాపురం సర్పంచ్ లు ముత్యాల సుజాత, ఉప్పు ప్రకాష్ లు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్సు సర్వీస్ వల్ల ఉదయం వేళలో వేములకొండ, లక్ష్మాపురం, శోభనాద్రిపురం, నీర్నేముల గ్రామాల విధ్యార్థిని, విద్యార్థులు మరియు ప్రయాణికులకు ఎందగానో ఉపయోగ కరంగాఉండేదని గత కొన్ని సంవత్సరాలుగా బస్సు రాకపోవటంతో కళాశాలలకు వెళ్ళే విద్యార్థులకు అనేక ఇబ్బందులు ఏర్పడి రోజుకు 50 రుపాయల నుండి 100 రూపాయలు వెచ్చించి ఆటోలలో ఇతర ప్రయివేటు వాహనాలలో కళాశాలలకు వెళ్ళవలసి వస్తుందని డబ్బులు లేని రోజు కళాశాలకు రానటువంటి పరిస్థితులు ఏర్పడినాయని అన్నారు. గతంలో వేములకొండ నుండి హైదరాబాద్ కు వెళ్ళే బస్సువల్ల మండలంలోని ప్రయాణీకులతో పాటు చేనేత ఆధారిత కుటుంబాలు వారి జీవనోపాధి కొరకు పోచంపల్లి, హైదరాబాద్ కు చేనేత వస్త్రాలను ఎగుమతి చేసుకొని జీవనం సాగించే వారని విధ్యార్థులకు, ప్రయాణికులకు సౌకర్యంగా ఉండే వేములకొండ హైదరాబాద్ బస్సును పునరుద్ధరణ చేయించి ప్రజలకు సౌకర్యం కల్పించాలని కోరారు.



# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**మరిపెడ, విశాల భారతి:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరిపెడలో స్వయం పరిపాలన దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పెండెం గణేష్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా బాలనాగు నవ్య వ్యవహరించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఉపాధ్యాయులై వినూత్న రీతిలో ఆకట్టుకునే విధంగా బోధించారు. విద్యార్థి ఉపాధ్యాయులు పాఠశాల వాతావరణం ఆహ్లాదకరంగా ఉందని, ఉపాధ్యాయులకు ధీటుగా బోధించామని, తాము కూడా భవిష్యత్తులో ఉపాధ్యాయులై సమాజ సేవ లో పాల్గొంటామని ఆశాభావం వ్యక్తంచేశారు.



# ట్రాఫిక్ పాయింట్స్ పరిశీలించిన ఎస్పీ

**ప్రజల అవసరాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలి**

**సూర్యాపేట, విశాలభారతి:** జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే బుధవారం సూర్యాపేట పట్టణ కేంద్రంలో ట్రాఫిక్ పాయింట్లను పరిశీలించి ట్రాఫిక్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. పట్టణంలో పెరుగుతున్న జనాభా ట్రాఫిక్ రద్దీ దృష్ట అవసరాలకు అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ, రెగ్యులేషన్ చర్యలను చేపట్టాలని ట్రాఫిక్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో గల ఈనాడు కార్యాలయం జంక్షన్, పి ఎస్ ఆర్ సెంటర్, హెడ్ పోస్ట్ ఆఫీస్ చౌరస్తా, కల్నల్ సంతోష్ బాబు చౌరస్తా, పట్టణంలో ఇతర ముఖ్య కూడళ్లను పరిశీలించారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రజల అవసరాల దృష్ట్యా వాహనాల రద్దీ బాగా పెరుగుతుందని, దానికి అనుగుణంగా పోలీసు చర్యలు చేపట్టాలని అన్నారు. ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, అధిక శబ్దాలు చేసే వాహనాల డ్రైవింగ్ పై కటినంగా వ్యవహరించాలి అని ఆదేశించారు. కార్యక్రమంలో సూర్యాపేట డివిజన్ డిఎస్పి నాగభూషణం, ట్రాఫిక్ ఎస్ఐ నవీన్, సిబ్బంది ఉన్నారు.



# ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

- ఏసుక్రీస్తు జీవితం భావితర పౌరులకు ఆదర్శనీయం
- కరస్పాండెంట్ చామకూరి శ్రీనివాస్

**సూర్యాపేట, విశాలభారతి:** ఎమ్మెస్ రెడ్డి పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను బుధవారం జిల్లా కేంద్రం లోని 24 వ వార్డు చంద్రన్న కుంట లో గల ఎమ్మెస్ రెడ్డి పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు పాఠశాల కరస్పాండెంట్ చామకూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీస్తు పుట్టిన జన్మదిన ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరు శాంతి, కరుణ, దయ గుణంను ఏసుక్రీస్తును ఆదర్శంగా తీసుకొని అలాంటి గుణం విద్యార్థులు అలవర్చుకోవాలని కోరారు. చిన్నారులు శాంటా తాత వేషధారణతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వివిధ నృత్య ప్రదర్శనలతో ఏసుక్రీస్తు గొప్పతనాన్ని చూపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రజిని, డైరెక్టర్ స్వర్ణలత, ఉపాధ్యాయ, ఉపాధ్యాయుని బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# సత్యవతి రాథోడ్ కి సిపిఐ నాయకుల పరామర్శ

**మహబూబాబాద్ ,విశాల భారతి:** మాజీ మంత్రి వర్యులు, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ సోదరుడైన గుండ్రాతి మడుగు మాజీ ఎంపిటీసీ కిషన్ నాయక్ నిన్న గుండెపోటుతో మృతిచెందగా వారికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసి వారి కుటుంబ సభ్యులైన మాజీ మంత్రి ఎమ్మెల్సీ సత్యవత్రి రాథోడ్ ని, వారి కుమారుడు బిఆర్ఎస్ జిల్లా నాయకులు శ్రీరామ్ నాయక్ జడ్పీ చైర్పర్సన్ బిందు,కురవి జడ్పిటిసి బండి వెంకటరెడ్డి లను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల సుధాకర్ రెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కామ సంజీవరావు, బండారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు




# ప్రజానాట్యమండలి నూతన కమిటీ ఎన్నిక

**ప్రకటించిన ధనుంజయ నాయుడు**

**సూర్యాపేట, విశాలభారతి:** తెలంగాణ ప్రజానాట్య మండలి సూర్యాపేట జిల్లా నూతన కమిటీ ఎన్నికైనట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తెలంగాణ ప్రజానాట్యమండలి సూర్యాపేట జిల్లా ఇన్చార్జ్ ధూళిపాళ ధనుంజయ నాయుడు ప్రకటించారు. బుధవారం నాడు ఆయన సూర్యాపేట లోని సిపిఐ కార్యాలయం లో విడుదల చేసిన పత్రిక ప్రకటనలో దేశ సంస్కృతికే అద్దం పట్టే జాతి సంపద లాంటి కళారూపాలను పరిరక్షించుకునేందుకు ప్రజానాట్యమండలి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. దేశంలో జరిగిన అన్ని ప్రజా పోరాటాలలో వెన్ను దన్నుగా నిలిచింది ప్రజానాట్యమండలి అని ఆయన గుర్తు చేశారు. అన్ని ప్రజా ఉద్యమాలకు ఊపిరి లూధింది ప్రజానాట్యమండలి అని ప్రజా కళల ద్వారానే ఉద్యమాలు విజయవంతము అవుతాయనేది చరిత్ర చెబుతున్న సత్యం అని, భవిష్యత్తులో కూడా ప్రజల పక్షాన నిలబడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల నూతన కళారూపాలు తయారుచేసి వారి సమస్యలను పరిష్కారం కోసం మొక్కవోని దీక్షతో ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కాగా తెలంగాణ ప్రజానాట్యం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా హుజూర్నగర్ కు చెందిన దొంతగాని సత్యనారాయణ ను ప్రధాన కార్యదర్శిగా తుంగతుర్తి నియోజకవర్గ చెందిన జంపాల మల్లయ్య, ఇతర ఆఫీస్ బేరర్స్ గా ఆర్ అన్నమ్మ, బేతవోలు చెందిన గురుస్వామి, సూర్య పేట ఎడెల్లి శ్రీకాంత్, జిల్లా కోశాధికారిగా అల్లిక లింగయ్య తదితరులు ఎన్నికయ్యారని ధనుంజయ నాయుడు తెలియజేశారు.



# బేటి బచావో బేటి పడావో పై అవగాహన సదస్సు

**మరిపెడ, విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా లోని మరిపెడ మండలములో ICDS ప్రాజెక్టు మీటింగ్ లో జిల్లా మహిళా సాధికారత కేంద్రం" ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో అవగాహన కార్యక్రమం మహిళా సాధికారత కేంద్రం సభ్యులు అరుణ, , రాకేష్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్. వరలక్ష్మి గారు మాట్లాడుతూ అమ్మాయిల రక్షణలో అంగన్వాడి పాత్ర గురించి చెప్పడము జరిగింది. గర్భిణిలకు, బాలింతలకు పోషకాహార మరియు అమ్మాయిల పట్ల వివక్షత చూపించకుండా తల్లులు ఇద్దరినీ సమానముగా పెంచినట్లయితే ఆడపిల్లలు వివక్షకి గురికాకుండా కాపాడుకోవచ్చు అని తెలియచేశారు. అమ్మాయిని రక్షించండి అమ్మాయిని చదివించండి మహిళా పథకాల గురించి, ఆడపిల్లలు పుట్టిన తరవాత వాళ్ళకి సంభదించిన పథకాల గురించి, బాల్య వివాహాలు గురించి, మరియు హెల్ప్ లైన్ నంబర్స్1098,181,100,14567 గురించి చెప్పడము అయినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్. వరలక్ష్మి గారు, CDPO శిరీష గారు, ICDS సూపర్వైసర్ 5 మరియు ఆగన్వాడీ టీచర్లు 150 మంది మరియు మహిళా సాధికారత కేంద్రం స్టాఫ్ అరుణ, రాకేష్ లు తదితరులు పాల్గొన్నారు.




# వాహనదారులకు హెచ్చరిక

**వాజేడు, విశాలభారతి:** మండల కేంద్రంలో పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మవరం వెళ్ళు రహదారి పై పేరూరు ఎస్సై రమేష్ వాహనాలు తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసు నమోదు చేస్తానని హెచ్చరించారు. వాహనదారులు ప్రతి ఒక్కరు లైసెన్సు వాహనాల కాగితాలు తీసుకోవాలని తెలిపారు. హనుమానిత వాహనాలను పూర్తిగా తనిఖీ చేసి వారి వద్ద సమాచారాన్ని సేకరించారు. పేరూరు ఎస్సై రమేష్ మరియు స్టేషన్ సిబ్బంది సిఆర్పిఎఫ్ జవాన్ పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily


# 141 ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడం అప్రజాస్వామికం...

**ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్.**



**ముషీరాబాద్,విశాలభారతి:** కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే 141 ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడం అప్రజాస్వామికం అని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. పార్లమెంట్ భద్రతా ఉల్లంఘనపై ప్రతిపక్ష ఎంపీలు నిలదీస్తే వారిని సస్పెండ్ చేసి అధికార బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడి చేసిందని ఆరోపించారు. పార్లమెంట్ లోపల విధ్వంసం సృష్టించిన దోషులకు ప్రవేశ పాస్‌లపై సంతకం చేసిన బీజేపీ ఎంపీ ప్రతాప్‌సింహ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయకుండా, నిరసన తెలిపిన ప్రతిపక్ష ఎంపిలను సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. మొదట చొరబాటుదారులు పార్లమెంటుపై దాడి చేశారని, ఆ తర్వాత మోదీ ప్రభుత్వం పార్లమెంట్, ప్రజాస్వామ్యంపై దాడి చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం,ప్రజాస్వామ్యంపై బీజేపీ కి ఏమాత్రం విశ్వాసం లేదన్నారు. మోడీ "విపరీతమైన నియంతృత్వం" ప్రశ్నించే గొంతుకలను అణిచివేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. దేశ ప్రజలకు స్పష్టంగా అర్థమౌతుందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి తరమి కొడతారని బుధవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో సుధాకర్ తెలిపారు.

# పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్.



**సూర్యాపేట, విశాలభారతి:** జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో త్రాగునీరు, లైటింగ్,పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ఇంజనీర్లను ఆదేశించారు. బుధవారం ఐడిఓసిలో పనుల పురోగతి, నిధుల లభ్యత,పెండింగ్ పనులపై మున్సిపల్ కమిషనర్లు సంబంధిత ఇంజనీర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదనపు కలెక్టర్ సి.హెచ్. ప్రియాంకతో కలసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలలో జంక్షన్ లలో లైటింగ్ ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచిస్తూ 80 శాతం వరకు పనులు పూర్తి అయిన వాటికి సత్వరమే పూర్తి చేయాలని మున్సిపాలిటీలలో మెరుగైన సౌలతులు కల్పించాలని సూచించారు. పట్టణాల్లో వివిధ నిర్మాణ దశలో ఉన్న సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. పనుల విషయంలో ఎక్కడకూడా రాజీ పడవద్దని చేపట్టిన పనులకు ప్రత్యేక తనిఖీలు ఉంటాయని, ఎల్.ఆర్.ఎస్ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. పారిశుద్ధ్య విషయంలో అశ్రద్ధ వహించిన, త్రాగునీటి సరఫరాలో అవాంతరం ఏర్పడిన, విధుల పట్ల నిర్లక్ష్యంగా వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకున్న బడతాయని కలెక్టర్ తెలిపారు.



# పారిశుద్ధ్య మెటీరియల్ వితరణ

**భద్రాచలం,విశాల భారతి:** ఐటిసి వావ్ సంస్థ వారి ఆధ్వర్యంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానానికి డస్ట్ బిన్ లు వ్యక్తిగత పారిశుద్ధ్య రక్షణ మెటీరియల్ అందజేయడం జరిగిందని ఐటిసి వావ్ చీఫ్ మేనేజర్ ఉమాకాంత్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేవస్థానం ఈవో రమాదేవికి ఈ మెటీరియల్ అందిస్తున్నామని భద్రాచలాన్ని టెంపుల్ ఏరియా క్లీన్ అండ్ గ్రీన్ గా ఉండేందుకు మా సాయి శక్తుల ప్రయత్నం చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిసి పిఎస్ పిడి చీఫ్ మేనేజర్ సెంగలరావు, సత్య శ్రీనివాసరావు వావ్ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఫౌండేషన్ సేవలు మరువలేనివి

**చిట్యాల, విశాలభారతి:** కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోనేటి యాదగిరి అన్నారు. ఉరుమడ్ల గ్రామంలో కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ తనయుడు లేకున్నా తన పేరిట ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేయడం వెంకట్ రెడ్డి దాతృత్వానికి నిదర్శనమని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెరుకు సైదులు, పట్ల జనార్ధన్, బొడ్డు శ్రీను, పందుల గోపాల్, చెరుకు యాదమ్మ, మెడి మనెమ్మ, కురుపటి లింగయ్య, చెరుకు శంకర్, కురుపటీ రామచంద్రం, కోనేటి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



# జీపీలో డీఎల్ పీవో విచారణ

- రూ. 20 లక్షల నిధుల దుర్వినియోగం
- ప్రభుత్వ భూమి విక్రయంపై ఫిర్యాదు

**మిర్యాలగూడ, విశాలభారతి:** మండలంలోని అవంతీ పురం గ్రామపంచాయతీపై వచ్చిన పలు ఆరోపణలపై బుధవారం డీఎల్ పీవో ప్రతాప్ నాయక్ క్షేత్ర స్థాయి విచారణ చేపట్టారు. కాగా అవంతీపురం జీపీ 9వ వార్డు సభ్యులు చల్లా ధర్మ పతి ఇక్కడి జీపీ అవినీతి వ్యవహారం పై డీఎల్ పీవోకు ఫిర్యాదు చేశారు. 2020-21, 2021-22 సంవత్సరాల్లో సుమారు రూ. 20 లక్షల నిధుల దుర్వినియోగం తో పాటు గ్రామ పంచాయతీ సమీపంలో ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి విక్రయించారని డీఎల్ పీవో దృష్టికి తీసుకొచ్చారు. గత కార్యదర్శి విధులు నిర్వహించిన సమయంలోనే అక్రమాలు చోటు చేసుకున్నాయని తగిన విచారణ చేయాలని కోరారు. నిధుల దుర్వినియోగం తీరుపై వేగవంతమైన చర్యలు చేపట్టి ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి విక్రయించిన వారి నుంచి రికవరీ చేయాలని కోరారు.



# ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్ లో ప్రవేశ పెట్టాలి

**ఎమ్మార్పీఎస్ దండోరా జిల్లా ఇంచార్జ్ రామంజి సైదులు**


**మిర్యాలగూడ, విశాలభారతి:** ఎస్సీ వర్గీకరణ బిల్లును రానున్న పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ దండోరా నల్గొండ జిల్లా ఇంచార్జ్ రామంజి సైదులు డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మార్పీఎస్ దండోరా మిర్యాలగూడ నియోజకవర్గ ఇంచార్జ్ గా అడవిదేవులపల్లి గ్రామానికి చెందిన బొజ్జ అనోక్ ను నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు నూకపంగు కాశయ్య, కందుల పెద్ద సైదులు, కలకొండ సత్యంతో కలిసి రామంజి సైదులు మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య పిలుపు మేరకు కార్యక్రమాలను సక్సెస్ ఎస్సీ వర్గీకరణ ను సాధించాలన్నారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షులు అందుగుల లక్ష్మణ్, ఇంద్రపల్లి శ్రీనివాస్, వల్లపు దాస్ కిరణ్, సైదులు, రంజిత్, మధు, రవీందర్, పరమేష్ తదితరులు ఉన్నారు.

# బిఆర్ఎస్ పార్టీకి కౌన్సిలర్ రాజీనామా



**చిట్యాల, విశాలభారతి:** మున్సిపాలిటీలోని 9వ వార్డు కౌన్సిలర్ బెల్లి సత్తయ్య బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశానని నాకు సహకరించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్ గా ప్రజలకు సేవలు అందిస్తూనే ఉంటానని నాకు ఓటు వేసి గెలిపించిన వార్డు ప్రజలందరితో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు.

# ఎమ్మెల్యే కోసం అభిమాని తలనీలాలు



**పాలకుర్తి, విశాల భారతి:** ఎమ్మెల్యే గెలవాలని మొక్కుకున్న ఓ అభిమాని తన మొక్కును తీర్చుకున్నాడు. తన అభిమాన నేత ఎమ్మెల్యేగా గెలవడంతో తలనీలాలు సమర్పించి దేవుడి బాకీని తీర్చుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన తాళ్లపెల్లి మధు అనే యువకుడు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఎమ్మెల్యేగా గెలిస్తే తన తలనీలాలు ఇస్తానని దేవుడికి మొక్కుకున్నాడు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మామిడాల యశస్విని రెడ్డి పాలకుర్తి ఎమ్మెల్యేగా విజయం సాధించిన నేపథ్యంలో ఆ అభిమాని తన మాట నిలబెట్టుకున్నాడు. బుధవారం చేర్యాల పట్టణంలోని కొమురవెల్లి మల్లన్నకు తన తలనీలాలు సమర్పించాడు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. ఝాన్సీరెడ్డి అంటే తనకు చాలా అభిమానమని అన్నాడు. పాలకుర్తిలో కాంగ్రెస్ పార్టీకి జవసత్వాలు కల్పించిన వ్యక్తి ఝాన్సీరెడ్డి అని కొనియాడాడు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఝాన్సీరెడ్డి పోటీ చేయాల్సి ఉండేనని, అయితే నాడు మంత్రిగా ఉన్న ఎర్రబెల్లి దయాకర్ రావు పౌరసత్వం పేరుతో ఆమెను పోటీలో నిలువకుండా చేశారని ఆరోపించాడు. ఈ క్రమంలోనే ఝాన్సీరెడ్డి తన కోడలు యశస్విని రెడ్డిని పాలకుర్తి ఎన్నికల బరిలో నిలిపారని అన్నాడు. ఈ నేపథ్యంలోనే యశస్విని రెడ్డి ఎమ్మెల్యే గెలవాలని కొమురవెల్లి మల్లన్నకు తన తలనీలాలు అర్పిస్తానని మొక్కుకున్నట్లు తెలిపాడు. దేవుడి ఆశీస్సులతో యశస్విని రెడ్డి భారీ విజయం సాధించారని తెలిపారు.

# రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు విద్యార్థులు ఎంపిక



**సైదాపూర్, విశాల భారతి:** కరీంనగర్ జిల్లా అంబేద్కర్ స్టేడియంలో బుధవారం జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్ జి ఎఫ్ అండర్ 19 బాలుర విభాగంలో కరాటే పోటీల్లో సైదాపూర్ మండలం లోని సోమారం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎస్. రాకేష్, హరి చరణ్ ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యారు. విద్యార్థులను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఫర్హానా, ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ పోతన శ్రీనివాస్, కరాటే మాస్టర్ రాజి రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, హనుమంతు, మోయిస్,ఫిజికల్ డైరెక్టర్ ఉయ్యాల విష్ణు వర్ధన్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు



# జంతుశాస్త్ర అంతర్జాతీయ సదస్సుకు అనూహ్య స్పందన



**సికింద్రాబాద్, విశాల భారతి :** ఓయూ సైన్సు కళాశాల జంతుశాస్త్ర విభాగం శత జయంతి ఉత్సవాల సందర్భంగా జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో " రీసెంట్ ట్రెండ్స్ ఇన్ జువాలజీ ఇన్నోవేషన్స్ ఛాలెంజస్ అండ్ అపర్చునిటీస్ " అనే అంశాలపై బుధవారం కళశాల సెమినార్ హాల్లో 3 రోజుల జాతీయ సదస్సును ప్రిన్సిపాల్ ప్రో.బి.వీరయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీసీఎంబీ డైరెక్టర్ విజయ్ కుమార్, నందికూరి మల్టీ డిస్ప్లనరి డ్రగ్ రిసిసెంట్ ఆఫ్ టిబి అనే అంశంపై మాట్లాడారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన యు ఎస్ ఎ నేషనల్ యూనిస్ట్యూట్ ఆఫ్ హెల్త్ డా.సి.విజయ సారథి డిఎన్ఎ సీక్వెన్సీ అండ్ డిఎన్ఎ రిపేర్ అనే అంశంపై ప్రసంగించారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు ఓయూ ఉన్నత అధికారులు హాజరు కాకపోవడం చర్చమశానియంగా మారింది. కార్యక్రమంలో డీన్ సీనియర్ ప్రో.కరుణ సాగర్, విభాగం బిఓఎస్ అండ్ ఆర్గనైజింగ్ సేకరేటరీ సీనియర్ ప్రో. ఎస్.జితేందర్ నాయక్, ప్రిన్సిపాల్ ప్రో.వీరయ్య, ప్రో. శ్రీనివాసులు, ప్రో.పద్మజ, ప్రో.చిత్ర, ప్రో.ఎ. నాగేశ్వర రావు, విభాగం అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఢిల్లీలో యూత్ కాంగ్రెస్ పిలుపు మేరకు పార్లమెంట్ గౌరవ్ లో నారాయణఖేడ్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కే శ్రీనివాస్, వినయ్ గౌడ్, మల్లేశం, ఉదయ్ శంకర్ పాటిల్, నరేష్ గౌడ్, ప్రదీప్, పాల్గొన్నారు.

# రైతు బిడ్డ శ్రీనయ్యకు ఓయూ డాక్టరేట్



**సికింద్రాబాద్, విశాల భారతి :** నల్లమల్ల ఫారెస్ట్ నివాసి రైతుబిడ్డ అయిన బాదమోని శ్రీనయ్య ఓయూ కంప్యూటర్ సైన్స్ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. ప్రో. వి.బి నరసింహ (సీఎస్ఈ, ఓయూ) పర్యవేక్షణలో ఈ గవర్నమెంట్ కోసం క్లౌడ్ కంప్యూటింగ్ అడాప్షన్ మోడల్ (ఐటీ సేవలు అందించడానికి క్లౌడ్ కంప్యూటింగ్ తప్పనిసరిగా ఒక కొలవగల, అనువైన, వినియోగానికి చెల్లింపు చేసే మార్గం కోసం నమూనా) విభాగంలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. తన తల్లిదండ్రులైన బాదమోని నారాయణ, తల్లి యశోద వ్యవసాయ కూలీలుగా పనిచేసుకుంటూ చదివించారు. అదేవిదంగా మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఓయూ వేదిక జరిగిన ఉద్యమంలో రబ్బర్ బుల్లెట్లను, భాష్ప వాయువులను, పోలీసుల కాల్పులను సైతం లెక్క చేయకుండా తెలంగాణ ఏర్పడేంత వరకు అతడు అలుపెరగని పోరాటం చేశారు. చివరకు తన అంతిమ పీహెచ్‌డీ లక్ష్యాన్ని చేరుకొన్నారు. ఈ సందర్భంగా ప్రొ. యం వెంకట్ దాస్ , ఓయూ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, ఆత్మీయ మిత్రులు మరియు కుంటుంబ సభ్యులు శ్రీనయ్యను అభినందించారు.



# ఆర్.ఎం.పి పి.ఎం.పి నూతన కార్యవర్గం ఎన్నిక

**బోడుప్పల్, విశాల భారతి:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బొమ్మక్ గంగయ్య ఫంక్షన్ హాల్ లో బోడుప్పల్ బొల్లి గూడ చెంగిచెర్ల ఆర్.ఎం.పి పి.ఎం.పి అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎలక్షన్ జరిగింది. ఈ ఎలక్షన్లో ఆర్ఎంపీలు 41 మంది పాల్గొన్నారు. అధ్యక్షులుగా కోటగిరి సతీష్ గౌడ్, అధ్యక్షుడుగా నాంపల్లి రాము వర్మ, ఉపాధ్యక్షులుగా నరసింహారెడ్డి, మహేశ్వరి, సెక్రటరీగా చంద్రమౌళి, కోశాధికారిగా వెంకట్ రెడ్డి, సలహాదారులుగా ఆనంద్ రాజ్, సంజీవ, వాసుదేవ్, కార్యవర్గ సభ్యులుగా M.V గౌడ్. మల్లేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నాగరాజు, లక్ష్మణ్, భరత్, వేణు, కుమారస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.



# జె ఎన్ టి యు హెచ్ యూనివర్సిటీలో క్రిస్మస్ సంబరాలు

**కూకట్ పల్లి, విశాల భారతి:** జె ఎన్ టి యు హెచ్ యూనివర్సిటీలో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో, లైవ్ మ్యూజిక్ తో, స్కిట్స్ తో అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జె ఎన్ టి యు హెచ్ యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మా యూనివర్సిటీలో మతసమరస్యం లేకుండా, కులాలకు, మతాలకు అతీతంగా అందరు విద్యార్థులు క్రిస్మస్ పండుగను జరుపుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కె బి హెచ్ బి. ఎస్ ఐ శ్రీలత రెడ్డి, యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఫారిన్ రిలేషన్స్ ప్రొఫెసర్ వసుమతి, ఏపీ టెక్నికల్ బోర్డు మాజీ సెక్రటరీ ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్ కుమార్, జేఎన్టిహెచ్ యూనివర్సిటీ స్పోర్ట్స్ సెక్రటరీ ప్రొఫెసర్ దిలీప్, నాన్ టీచింగ్ స్టాఫ్ ప్రధాన కార్యదర్శి జకరయ్య, యూనివర్సిటీ స్టూడెంట్ లీడర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజల్లోనే ఉందాం.. సమస్యలపై పోరాడుదాం

**పాలమూరు ట్రస్ట్ అధినేత విష్ణువర్ధన్ రెడ్డి**



**షాద్ నగర్, విశాలభారతి:** ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయినంత మాత్రాన ప్రజాసేవకు దూరమయ్యేది లేదని.. ప్రజల్లోనే ఉండి ప్రజా సమస్యల పరిష్కారంకు కృషి చేద్దామని పాలమూరు ట్రస్ట్ అధినేత విష్ణువర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండల పరిధిలోని సంగెం, ఎక్లాస్ ఖాన్ పేట, భైర్కాన్ పల్లి, మంగళిగూడ, అల్వాల్, కొత్తపేట, కోనాయపల్లి, బోధనంపల్లి, లేమామిడి,నిర్దవెల్లి,తొమ్మిదిరేకుల, లింగంధన, కాకునూరు గ్రామాల్లో పర్యటించి నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పట్టు సాధించాలంటే స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి కేంద్రికరించాలని సూచించారు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి అవి పరిష్కారం అయ్యేవరకు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పసుల నర్సింహాయాదవ్, కుమార్ గుప్త,కుమ్మరి మహేష్,శ్రీనివాస్, యాదయ్య,చేగూరు శ్రీను పాల్గొన్నారు.



# తెలంగాణ ఫిలిం ఇండస్ట్రీకి తోడుగా ఉంటా

: మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారిని తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో అధ్యక్షులు డాక్టర్ ప్రతాని రామకృష్ణ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి సినిమా ఇండస్ట్రీకి సంబంధించిన పలు సమస్యలు తెలియజేశారు ఈ సందర్భంగా.. మినిస్టర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ఏర్పాటు కోసం నేను మంత్రి పదవినే త్యాగం చేశాను అలాంటి తెలంగాణలో ఫిలిం ఇండస్ట్రీ బాగుండాలని కోరుకుంటున్నాను 24 శాఖలలో లో ఉన్న సినీ వర్కర్స్ ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా చేసి పెడతాను ఇందిరమ్మ రాజ్యంలో మీ ఫిలిం ఇండస్ట్రీకి తప్పకుండా సపోర్టుగా నేను మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. మా సహకారంతో హైదరాబాద్ లో ఫిల్మ్ ఇండస్ట్రీని అభివృద్ధిలో నడిపించండి త్వరలో మీతో మళ్ళీ ఒకసారి కలిసే అన్ని విషయాలు చర్చించుకుందాం అన్నారు. తెలంగాణ ఫిలిం ఛాంబర్ చైర్మన్ డాక్టర్ ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ... మినిస్టర్ గారిని కలిసి అభినందనలు తెలిపి సినీ పరిశ్రమలో ఉన్న సమస్యల గురించి వివరించడం జరిగినది. దానికి వారు స్పందించి మీ సమస్యలను తీర్చడానికి నేను సిద్ధంగా ఉంటాను మీరు ఎప్పుడైనా రావచ్చు అని అన్నారు మేము మళ్లీ ఒకసారి మంత్రి గారిని కలిసి మాకు ఉన్న సమస్యలన్నీ తెలపాలనుకుంటున్నాము.

# 'సర్కారు నౌకరి' ట్రైలర్ రిలీజ్



ప్రముఖ సింగర్ సునీత కుమారుడు ఆకాష్ హీరోగా పరిచయవుతున్న సినిమా "సర్కారు నౌకరి". ఈ చిత్రంలో భావన హీరోయిన్ గా నటిస్తోంది. సర్కారు నౌకరి చిత్రాన్ని ఆర్కే టెలీ షో బ్యానర్ పై దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు నిర్మిస్తున్నారు. గంగనమోని శేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. "సర్కారు నౌకరి" సినిమా న్యూఇయర్ సందర్భంగా వచ్చే జనవరి 1న థియేటర్స్ లో ఘనంగా విడుదలవుతోంది. ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమం బుధవారం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు వీఎన్ ఆదిత్య, రైటర్ బీవీఎస్ఎన్ రవి, సినిమా టీమ్ మెంబర్స్ పాల్గొన్నారు. డైరెక్టర్ శేఖర్ కమ్ముల, డైరెక్టర్ అనిల్ రావిపూడి ట్రైలర్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా... దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు మాట్లాడుతూ నేను దర్శకుడిగా ఏడాదికి ఏడెనిమిది సినిమాలు చేసిన సందర్భాలున్నాయి. ఇప్పుడు ట్రెండ్ మారింది. శేఖర్ కమ్ముల, అనిల్ రావిపూడి లాంటి దర్శకులు రెండేళ్లు, మూడేళ్లకు సినిమాలు చేస్తున్నారు. అయినా వారి సినిమాల కోసం ప్రేక్షకులు ఎదురుచూస్తునే ఉన్నారు. అంటే శేఖర్, అనిల్ ప్రేక్షకుల్ని ఎంతగా తమ దర్శకత్వ ప్రతిభతో ఆకట్టుకున్నారో అర్థం చేసుకోవచ్చు. అనిల్ రావిపూడి పటాస్ తో మొదలై ఇవాళ బాలకృష్ణతో భగవంత్ కేసరి లాంటి సూపర్ హిట్ మూవీ చేశాడు. రేపు మెగాస్టార్ తో సినిమా చేస్తాడు. "సర్కారు నౌకరి" మీకు నచ్చుతుంది. థియేటర్స్ లో చూడమని కోరుతున్నా అన్నారు. డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ "సర్కారు నౌకరి" సినిమా ట్రైలర్ చూశాను. చాలా బాగుంది. ఒక నేచురల్ అట్మాస్ఫియర్ లో చేసిన సినిమా ఇది. ఆకాష్, భావన, డైరెక్టర్ శేఖర్, సునీత గారికి ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. న్యూ ఇయర్ రోజున మీ సినిమా రిలీజ్ అవుతోంది. మంచి సక్సెస్ కావాలని కోరుకుంటున్నా. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు గారు మాకు గురువు లాంటి వారు. ఆయన సినిమాలు చూసి పెరిగి, ఇండస్ట్రీకి వచ్చిన మాకు ఆయన నుంచి చిన్న ప్రశంస దక్కినా అది పెద్ద అఛీవ్ మెంట్ లా భావిస్తాం. మమ్మల్ని ఎప్పుడూ ఎంకరేజ్ చేస్తుంటారు. థ్యాంక్యూ గురువు గారు. రెండేళ్లకు సినిమా చేసినా మా మీద చాలా ప్రెషర్ ఉంటోంది. ఇవాళ ఆడియెన్స్ కు సినిమా నాలెడ్జ్ గా బాగా పెరగడమే కారణం అనుకుంటున్నా. అన్నారు. డైరెక్టర్ శేఖర్ కమ్ముల మాట్లాడుతూ ఇక్కడికి వచ్చాక రాఘవేంద్రరావు గారితో మాట్లాడుతూ అన్నాను. మీరు చేసిన బ్లాక్ బస్టర్స్ ఈ టైమ్ లో చేసి ఉంటే ఛార్టెడ్ ఫ్లైట్ లో తిరిగేవారు.. మీ సినిమాలు అంత కలెక్ట్ చేసేవి అన్నాను. రాఘవేంద్రరావు గారు మా గురించి ప్రశంసిస్తూ మాట్లాడుతుంటే హ్యాపీగా ఉంది. ఆయనది లక్కీ హ్యాండ్ ఈ సినిమా మంచి హిట్ కావాలి. "సర్కారు నౌకరి" ట్రైలర్ బాగుంది. తెలంగాణ విలేజ్ బ్యాక్ డ్రాప్ లో ఒక కొత్త వరల్డ్ క్రియేట్ చేశారు. కొత్త వాళ్లు నటించేప్పుడు కొంత బెరుకు ఉంటుంది. ఆకాష్ అనుభవం ఉన్న నటుడిలా పర్ ఫార్మ్ చేశాడు. దర్శకుడు శేఖర్ మూవీని ఆకట్టుకునేలా చేశాడు. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. అన్నారు.

# రత్తాలు ముత్యాలు పూల్‌సైడ్ రచ్చ

ఇంతకీ ఎవరీ రత్తాలు - ముత్యాలు..? స్విమ్ సూట్లతో రచ్చ రంబోలా చేస్తున్నారు. వీళ్లెవరో కనిపెట్టారా? రత్తాలు సింగారానికి, ముత్యాలు హొయలుకి ఫిదా అయిపోవాల్సిందే. ఎందులోనూ తగ్గేదేలే అంటున్న ఈ భామలు రకుల్ ప్రీత్- ప్రగ్య జైశ్వాల్. వీలు కుదిరినప్పుడల్లా ముంబై రెస్టారెంట్లు, పబ్లిక్ వేదికలపై ఈ జోడీ బోలెడంత రచ్చ చేస్తున్నారు. ఆ ఇద్దరూ ముంబైలో ఉన్నప్పుడు సాయంత్రాల మీటింగులు, సినిమాల గురించిన కబుర్లు చెప్పకుంటూరు. రెస్టారెంట్లు, బాలీవుడ్ ఈవెంట్లకు వెళుతుంటారు. A కొన్నేళ్లుగా ఆ ఇద్దరూ ముంబై ఈవెంట్లలో సందడి చేస్తూ మీడియా కంటికి చిక్కుతున్నారు. ముఖ్యంగా ఆ ఇద్దరి స్నేహం గురించి ముంబై పరిశ్రమలో బోలెడంత చర్చ సాగుతోంది. ఏది ఏమైనా కానీ రత్తాలు ముత్యాలు తరహాలో ఈ జంట స్నేహం అందరిలో స్ఫూర్తి నింపుతోంది. అటు హిందీ పరిశ్రమ, ఇటు తెలుగు పరిశ్రమలో అవకాశాలు ఎలా అందిపుచ్చుకోవాలో తెలియక ఈ భామలిద్దరూ ఇటీవల సతమతమవుతున్నారు. రకుల్ ఇప్పటివరకూ తన హిందీ నిర్మాత కం బోయ్ ఫ్రెండ్ సాయంతో తన మనుగడను సాగిస్తోంది. త్వరలోనే అతడిని పెళ్లాడుతుందని భావిస్తున్నా ఇప్పట్లో ఆ ప్రకటన ఉండేట్టు లేదు. ప్రగ్య ప్రస్తుతం ఎఫైర్లతో సంబంధం లేకుండా కెరీర్ బండిని సాగిస్తోంది. ఒక చిన్న పూల్ పార్టీ ఎవరి హృదయాలను గాయపరచకుండా.. అంటూ ఈ అందమైన ఫోటోషూట్ ని షేర్ చేయగా అది వైరల్ గా మారుతోంది. రకుల్- ప్రగ్యతో పాటు, పూల్ సైడ్ పార్టీలో నేహా శెట్టి, మంచు లక్ష్మి, నంబియార్, సౌమ్య తదితరులు ఉన్నారు. ఇందులో రకుల్- ప్రగ్య సపరేట్గా ఉన్న స్పెషల్ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. హృదయాలను గాయపరచకుండా లేదా దొంగిలించకుండా ఏదీ ఉండదని ఈ ఫోటో చూసాక మనం అర్థం చేసుకోవాలి. ఈ ఇద్దరికీ పాపులర్ జువెలరీ బ్రాండ్.. పాపులర్ డిజైనర్ దుస్తుల బ్రాండ్, ఫుట్ వేర్ బ్రాండ్ ప్రమోషన్ ని అందిస్తున్నాయి.



# శ్రీ పద్మిని సినిమాస్ ప్రొడక్షన్ నెంబర్ 3 'మహతి' ప్రారంభం



యంగ్ ట్యాలెంటెడ్ హీరో సందీప్ మాధవ్ కథానాయకుడిగా శివ ప్రసాద్ స్వీయ దర్శక నిర్మాణంలో శ్రీ పద్మిని సినిమాస్ ప్రొడక్షన్ నెంబర్ 3గా రూపొందుతున్న చిత్రం 'మాహతి'. సుహాసిని మణిరత్నం, దీప్సిక కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ రోజు ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో గ్రాండ్ గా ప్రారంభమైయింది. ముహూర్తపు సన్నివేశానికి చంద్రమౌళి క్లాప్ కొట్టగా, పద్మ కెమరా స్విచాన్ చేశారు. సుహాసిని మణిరత్నం మేకర్స్ కు స్క్రిప్ట్ ని అందించగా తొలి షాట్ కి రాజారవీంద్ర గౌరవ దర్శకత్వం వహించారు. సినిమా లాంచింగ్ ఈవెంట్ లో సుహాసిని మణిరత్నం మాట్లాడుతూ.. మహతి సినిమా ముహూర్తంలో అందరినీ కలుసుకోవడం చాలా ఆనందంగా వుంది. నా తొలి సినిమా విడుదలై నేటికి సరిగ్గా 43 ఏళ్ళు అవుతుంది. పరిశ్రమలో 44 ఏడాదిగా మహతి సినిమాతో ప్రారంభిస్తున్నాను. ఇప్పటివరకూ కెరీర్లో ఎన్నో చిత్రాలు చేశాను. ఎన్నో జయపజయలు చూశాను. అవన్నీ గతంలోనే వదిలేసి ఇప్పుడు తొలి సినిమా చేస్తున్న అనుభూతితోనే ఈ చిత్రాన్ని చేస్తున్నాను. తెలుగు సినిమాలో చేయడం ఒక అలవాటుగా మారింది. కథ, పాత్ర నచ్చితేనే సినిమా చేస్తాను. మహతి కథ, నా పాత్ర చాలా నచ్చింది. ఫ్యామిలీ ఎమోషన్స్, సెంటిమెంట్స్ వుంటాయి. టైటిల్ కి తగట్టు మహిళా ప్రాధాన్యత గల చక్కని అంశాలు వున్నాయి. ఒక క్రైమ్ చేయడం కంటే ఆ క్రైమ్ ని చూస్తూ ఏం చేయకుండా ఊరుకోవడం ఇంకా పెద్ద క్రైమ్. అదే ఈ సినిమా ప్రధానాంశం. ఇందులో వుండే పాత్రలని అద్భుతంగా తీర్చిదిద్దారు దర్శకుడు. చాలా మంచి టీం కలసి పని చేస్తున్నాం. టీం అందరికీ బెస్ట్ విషెస్'' తెలిపారు. దర్శక, నిర్మాత శివ ప్రసాద్ బూర్లె మాట్లాడుతూ.. దర్శకుడిగా ఇది నా రెండో చిత్రం. నిర్మాతగా మూడవది. సుహాసిని గారికి కథ చెప్పగానే మరో మాట లేకుండా ఎప్పుడు చేస్తున్నావ్ అన్నారు. అలాగే మా హీరో సందీప్ గారు, మిగతా టీంసభ్యులంతా కథని బలంగా నమ్మారు. వాళ్ళ నమ్మకాన్ని నిలబెడతాననే నమ్మకం వుంది'' అన్నారు.

# మతిపోగొట్టేసిన మాళవిక అందం

దళపతి విజయ్ సరసన 'మాస్టర్' మూవీ తో హీరోయిన్ గా లైమ్ లైట్లోకి వచ్చిన మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్ ప్రస్తుతం కోలీవుడ్ టాలీవుడ్ లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తోంది. ప్రెజెంట్ హీరోయిన్ గా మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తోంది. ఓవైపు సినిమాలతో బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్ గా ఉంటూ మెల్లమెల్లగా పాపులారిటీ పెంచుకుంటుంది. సోషల్ మీడియాలో నిత్యం తన గ్లామరస్ ఫోటోలను షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈమధ్య అందాల ఆరబోతలో అదిరిపోయే అవుట్ ఫిట్స్ ధరిస్తూ నెట్టింట దుమారం రేపుతోంది. మత్తెక్కించే కళ్ళతో కుర్రాళ్లను తన వైపుకు తిప్పకునేలా గ్లామర్ ని ఒలకబోస్తున్న ఈ ముద్దుగుమ్మ తాజాగా తన సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలను అభిమానులతో పంచుకుంది. ఈ ఫోటోలో మరోసారి అదిరిపోయే అవుట్ ఫిట్ తో దర్శనమిచ్చింది. రెడ్ కలర్ అవుట్ ఫిట్ లో కళ్ళతోనే మాయ చేసేలా ఎక్స్ప్రెషన్స్ ఇస్తూ మాళవిక దిగిన లేటెస్ట్ పిక్స్ ఫ్యాన్స్ ని తెగ ఆకట్టుకుంటున్నాయి. స్టయిలిష్ సిట్టింగ్స్ ఫోజులతో నెటిజన్స్ చూపు తిప్పకోకుండా చేసింది. దీంతో మాళవిక ఫ్యాన్స్ ఈ అమ్మడి లేటెస్ట్ పిక్స్ ని సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తున్నారు. అంతేకాకుండా రెడ్ కలర్ అవుట్ ఫిట్ లో మాళవిక మరింత హాట్ గా ఉందని కామెంట్స్ చేస్తున్నారు.



# సుహాస్, సంకీర్తన విపిన్ దిల్ రాజు ప్రొడక్షన్స్ నెం.4 ప్రారంభం



విలక్షణమైన పాత్రలతో నటుడిగా తనదైన గుర్తింపు సంపాదించుకున్న 'కలర్ ఫోటో' ఫేమ్ సుహాస్ కథానాయకుడిగా ప్రముఖ నిర్మాణ సంస్థ దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ ప్రొడక్షన్ నెం.4 చిత్రంగా సోమవారం లాంఛనంగా ప్రారంభమైంది. సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వం వహిస్తున్నారు. సంకీర్తన విపిన్ కథానాయిక. ప్రముఖ నిర్మాత శిరీష్ ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి ప్రశాంత్ నీల్ క్లాప్ కొట్టారు. అనీల్ రావిపూడి కెమెరా స్విచ్ ఆన్ చేయగా, బలగం వేణు గౌరవ దర్శకత్వం వహించారు. దిల్ రాజు, శిరీష్ స్క్రిప్ట్‌ను అందించారు. బలగం వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌లో ఆకాశం దాటి వస్తావా రెండో చిత్రంగా రూపొందుతోంది. రీసెంట్‌గా ఆశిష్‌తో మూడో సినిమాను స్టార్ట్ చేశారు. ఇప్పుడు సుహాస్ కథానాయకుడిగా నాలుగో సినిమా ప్రారంభమైంది. కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేస్తూ దిల్ రాజు ప్రొడక్షన్స్ వైవిధ్యమైన సినిమాలతో దూసుకెళ్తోంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను తెలియజేస్తామని చిత్ర యూనిట్ సభ్యులు తెలియజేశారు.



# సిద్ధార్థ్ రాయ్ నుంచి సోల్ ఫుల్ థర్డ్ సింగిల్

టాలీవుడ్‌లోని దాదాపు అందరు స్టార్ హీరోలతో పనిచేసిన పాపులర్ చైల్డ్ ఆర్టిస్ట్, యంగ్ హీరో దీపక్ సరోజ్ 'సిద్ధార్థ్ రాయ్' తో హీరోగా అరంగేట్రం చేస్తున్నారు. హరీష్ శంకర్, వంశీ పైడిపల్లి వంటి పెద్ద దర్శకుల దగ్గర పనిచేసిన వి యశస్వీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం టీజర్ ట్రెమండస్ రెస్పాన్స్ తో వైరల్ అయ్యింది. అలాగే స్టార్ కంపోజర్ రధన్ స్వరపరిచిన చెలియాచాలు, లైఫ్ ఈజ్ దిస్ బ్యూటిఫుల్ పాటలు చార్ట్ బస్టర్ హిట్స్ గా అలరిస్తున్నాయి. ఇప్పుడు థర్డ్ సింగిల్ నువ్వెవరో మరి పాటని విడుదల చేశారు మేకర్స్. రధన్ ఈ పాట కోసం సోల్ ఫుల్ నెంబర్ ని కంపోజ్ చేశారు. బెన్నీ దయాల్ ఎనర్జిటిక్ వోకల్స్ తో ఆకట్టుకున్న ఈ పాటకు పూర్ణాచారి అందించిన లిరిక్స్ మరింత ఆకర్షణ తీసుకొచ్చాయి. ఈ పాటలో హీరో క్యారెక్టర్ ని ప్రజెంట్ చేసిన విధానం చాలా యూనిక్ ఉంటూ క్యురియాసిటీని పెంచింది. శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్, విహాన్ & విహిన్ క్రియేషన్స్ పతాకాలపై ప్రొడక్షన్ నెం 1గా జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయినలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.